Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 184 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 జూలై 2024 శుక్రవారం పేజీలు : 4

## మత వ్యాఖ్యలు సరికాదు: బంగ్లాదేశ్

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు సరికాదని బంగ్లాదేశ్ పేర్కొంది. ఈ మేరకు భారత ప్రభుత్వానికి ఒక అధికారిక నోట్ పంపింది. తాము ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై తమకు ఎంతో గౌరవం ఉందని, అయితే ఆమె చేసిన వ్యాఖ్యలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి హసన్ మహ్మూద్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లపై బంగ్లాదేశ్‌లో హింస జరుగుతున్న నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చే శరణార్థులకు బెంగాల్‌లో ఆశ్రయం కలిస్తామని మమతాబెనర్జీ ఇటీవల ఓ ర్యాలీలో ప్రకటించిన సంగతి తెలిసిందే.




# సామాన్యుడు మెచ్చేలా

## ఎక్స్‌ట్రా పన్నులకు నో
## భూముల అమ్మకాలకు సై

## పూర్తి స్థాయిలో ఆకట్టుకున్న 'రేవంతుడి పద్దు'!

హైదరాబాద్ : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సభలో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టబోతోన్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. తెలంగాణ బడ్జెట్‌లో మొత్తం వ్యయం 2,91,159 కోట్ల రూపాయలు. రెవెన్యూ వ్యయం 2,20,945 కోట్ల రూపాయలు. ఇక మూల ధన వ్యయం మొత్తాన్ని 33,487 కోట్ల రూపాయలుగా భట్టి విక్రమార్క ప్రతిపాదించారు. ఊహించినట్టే బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయ శాఖకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో రైతులపై వరాల జల్లును కురిపించారు భట్టి విక్రమార్క. ఈ సంవత్సరం తాము ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరబోతోన్నామని అన్నారు. దీని ద్వారా అన్నదాతలకు రైతు బీమాను వర్తింపజేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఫసల్ బీమా యోజన కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. ప్రజలపై అదనంగా ఎలాంటి పన్నులను విధించకూడదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. పన్నులు వేయడం వల్ల వచ్చేఆదాయాన్ని ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సమీకరించుకోవడానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో బ్యాంకులు, వివిధ ఆర్థిక సంస్థల వద్ద అప్పులు చేయడం, భూములను అమ్మకానికి పెట్టడం వంటివి మార్గాలను ఎంచుకున్నట్టే కనిపిస్తోంది. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో పన్నేతర ఆదాయం 35,208.44 కోట్ల రూపాయలుగా అంచనా వేసింది. ఇన్ని వేల కోట్ల రూపాయల మొత్తాన్ని ఎలా సమీకరిస్తుందనేది ప్రశ్నార్థకం. దీనికి సంబంధించిన వివరాలను కూడా బడ్జెట్ ప్రతిపాదనల్లో ఎక్కడ కూడా పొందుపర్చనట్టే. ఈ మొత్తాన్ని భూముల అమ్మకం ద్వారా సమీకరించాలనేది ఓ ప్రత్యామ్నాయం. ఈ టార్గెట్‌ను గనక అందుకోలేకపోతే- రుణాలను తీసుకోవడానికే మొగ్గు చూపించడం ఖాయంగా కనిపిస్తోంది. అదే సమయంలో వివిధ సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో కోత పెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.



## గ్యారెంటీలను గంగలో కలిపేసిన కోతల, ఎగవేతల బడ్జెట్: కేటీఆర్

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఇది ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని ఆంక్షల పద్దు అని విమర్శించారు. గ్యారెంటీలను గంగలో కలిపేసిన కోతల, ఎగవేతల బడ్జెట్ అని ఎద్దేవా చేశారు. విధానం, విషయం, విజన్ లేదని, పేర్ల మార్పులతో ఏమార్చిన డొల్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని ధ్వజమెత్తారు. వాగ్దానాలను గాలికొదిలిన వంచనల బడ్జెట్.. డిక్లరేషన్లను బుట్టదాఖలు చేసిన దోకేబాజ్ బడ్జెట్ అంటూ మండిపడ్డారు. "రైతులకు కత్తిరింపులు.. అన్నదాతలకు సున్నం. ఆడబిడ్డలకు అన్యాయం.. మహాలక్ష్ములకు మహామోసం. అవ్వాతాతలు, దివ్యాంగులు, నిరుపేదలు, నిస్సహాయులకు మొండిచేయి. పింఛన్ల పెంపు మాటెత్తలేదు. దళితులను దగా చేశారు.. గిరిజనులను మోసం చేశారు. అంబేడ్కర్ అభయహస్తం ఊసులేదు.. శూన్యహస్తమే మిగిలింది. బడుగు బలహీనవర్గాలకు భరోసాలేదు. వృత్తి కులాలపై కత్తికట్టారు"అని కేటీఆర్ పోస్టు పెట్టారు.

## గ్యాస్ సిలిండర్లకు 723 కోట్లు.. ఉచిత విద్యుత్‌కు 2,418 కోట్లు

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన ఆరు గ్యారంటీలకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రారంభించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లో వాటికి నిధులు కేటాయించింది. ఆరు గ్యారంటీల్లో మరికొన్ని పథకాలనూ ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర నుంచి ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే వంటగ్యాస్ సిలిండర్‌ను తమ ప్రభుత్వం ప్రారంభించిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం వల్ల ఇప్పటి వరకు 39,57,637 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, ఇందుకు రూ.200 కోట్లను ప్రభుత్వం వెచ్చిందన్నారు. ఈ బడ్జెట్‌లో గ్యాస్ సిలిండర్ల కోసం రూ.723 కోట్లు ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. మహిళను మహాలక్ష్మిగా గౌరవించడం మన సంస్కృతి అని, మహాలక్ష్మి పథకం కింద తెలంగాణ రాష్ట్రంలోని మహిళలందరికీ టీజీఆర్టీసీ నడిపే బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రయాణించే దూరంపైన, ప్రయాణించే పర్యాయాలపైన ఎటువంటి పరిమితీ విధించలేదని చెప్పారు. ఇప్పటి వరకు 68.60 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని, పర్యవసానంగా మహిళలకు రూ.2,351 కోట్లు ఆదా అయ్యిందన్నారు. ఉచిత బస్సు సౌకర్యం పరోక్షంగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని పేర్కొన్నారు. ఈ పథకానికి అయ్యే ఖర్చు ఆర్టీసీకి ప్రభుత్వం నెలవారీగా చెల్లిస్తోందని, దీనివల్ల ఆర్టీసీ సంస్థ కూడా ఆర్థికంగా బలోపేతమై బిలియన్ డాలర్ కార్పొరేషన్‌గా అవతరించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి 1 నుంచి గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు.



200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్‌ని వినియోగించుకొనే గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజాపాలన-ప్రజా సేవ కేంద్రాల ద్వారా వచ్చిన ధరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారందరికి ఈ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు డిస్కంలు సున్నా బిల్లులు జారీ చేస్తున్నాయని, ప్రభుత్వం ఆ బిల్లుల మొత్తం ఛార్జీలను డిస్కంలకు చెల్లిస్తుందని చెప్పారు. జులై 15 నాటికి 45,81,676 ఇళ్లల్లో వెలుగుల జిలుగులు నింపగా.. జూన్ వరకు అందించిన విద్యుత్తుకుగానూ డిస్కంలకు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.583.05 కోట్లు చెల్లించిందన్నారు. ఈ బడ్జెట్‌లో ఉచిత విద్యుత్‌కు రూ.2,418 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ ప్రధాన కర్తవ్యమని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా తమ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' నూతన గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ పథకం కింద పేదలు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.6 లక్షలు చెల్లిస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4,50,000 ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని నిర్ణయించామని తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల పథకం కింద పూర్తయిన ఇళ్లను త్వరలోనే కేటాయిస్తామన్నారు. పూర్తికాని వాటిని సత్వరమే పూర్తి చేసి మౌలిక వసతులను కల్పించి అర్హులకు అందజేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరిగేవి కాదని, తమ ప్రభుత్వం 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. ఇప్పటి వరకు రూ.10,556 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లోకి జమ చేశామన్నారు. అర్హులైన రైతులకు మాత్రమే లబ్ధి చేకూరేలా రైతుబంధు పథకం స్థానే రైతు భరోసాను తమ ప్రభుత్వం తీసుకొచ్చిందని భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు ఏటా ఎకరానికి రూ.15,000 చెల్లించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. దీని అమలుకు విధివిధానాలు చర్చించి నిర్ణయించడానికి ఒక క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ఇప్పటికే పలువురి అభిప్రాయాలను సేకరించిందని, వాటిని సభలో సభ్యులందరి అభిప్రాయాన్ని తీసుకొని అమలు చేయాల్సిన విధి విధానాలపై తగిన నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తెలంగాణలో వరి సాగు చాలా విస్తృతంగా జరుగుతుందని, పండిన పంటకు సరైన ధర రాక పెట్టుబడి కూడా దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో సన్న రకం వరి ధాన్యాల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను గుర్తించి, వాటిని పండించిన రైతుకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల సన్నరకాల వరిని పండించే సాగు భూమి విస్తీర్ణం పెరిగి, రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.

# బడ్జెట్ 2.91 లక్షల కోట్లు

## రేవంత్ సర్కారు తొలి పూర్తిస్థాయి పద్దు




హైదరాబాద్ : ఉమ్మడి ఏపీ విభజన తర్వాత అందరి కళ్లూ తెలంగాణ బడ్జెట్ మీదనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదేమో..? హైదరాబాద్ వంటి నగరాన్ని కలిగి ఉండడమే దీనికి కారణంగా చెప్పాలి. అలాంటిది ఇప్పుడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కాదు. తెలంగాణ సొత్తుగా మారాక.. ఈ నగరం నుంచి వచ్చే ఆదాయం తెలంగాణకే చెందుతుంది. అంటే ఏపీకి ఆదాయం పంచాల్సిన అవసరం లేదు. మరోవైపు రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇదే తొలి పూర్తి స్థాయి బడ్జెట్. ఈ నేపథ్యంలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు ఎలాంటి బడ్జెట్ ప్రవేశ పెడుతుంది అనేది ఆసక్తికరంగా మారింది. మరి ఈ అంచనాలను నిలుపుకొనేలా తెలంగాణ బడ్జెట్ ఉన్నదా?

**వ్యవసాయానికి పెద్దపీట..** తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం ప్రవేశపెట్టని రాష్ట్ర బడ్జెట్ రూ.2,91,159 కోట్లు. ఇందులో మూలధన వ్యయం రూ.33,487 కోట్లు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు. కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లు. కాగా.. ఈ ఏడాది రూ.57,112 కోట్లు అప్పుగా తీసుకోవాలని ప్రతిపాదించారు. బడ్జెట్ లో అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించారు. ఆ తర్వాత దళిత సంక్షేమానికి ప్రాధాన్యం దక్కింది. ఇందుకు రూ.33,124 కోట్లు ఇచ్చారు. మూడో స్థానంలో పంచాయతీరాజ్ రూరల్ డెవలప్ మెంట్ (29,816 కోట్లు) ఉండడం గమనార్హం.

**నీటి పారుదుల, విద్యకు సమానంగా..** రేవంత్ ప్రభుత్వం ప్రాధాన్య రంగాలుగా భావిస్తున్న నీటిపారుదలకు బడ్జెట్ లో రూ.22,301 కోట్లు, విద్యకు రూ.21,292 కోట్లు ఇచ్చింది. ట్రాన్స్ కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు, ఉద్యానశాఖకు రూ.737 కోట్లు, పశు సంవర్ధవ శాఖకు రూ.1,980కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు, ఎస్టీ సంక్షేమం రూ.17,056 కోట్లు,మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు, బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు, వైద్య, ఆరోగ్యం రూ.11,468 కోట్లు, అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు, పరిశ్రమల శాఖకు రూ.2,762 కోట్లు, ఐటీ శాఖకు రూ.774 కోట్లు కేటాయించింది.

**సిలిండర్ పథకానికి..** ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కీలకమైన రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రేవంత్ సర్కారు తొలి పద్దులోనే భారీగా నిధులిచ్చింది. దీనికి రూ. 723 కోట్లు ఇవ్వనుంది. గృహజ్యోతికి రూ.2,418 కోట్లు, ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836 కోట్లు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు రూ.1,525 కోట్లు, హోం శాఖకు రూ.9,564 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు ఇచ్చింది. బడ్జెట్ లో మూల ధన వ్యయం రూ.33 వేల 487 కోట్లుగా పేర్కొన్న రేవంత్ ప్రభుత్వం.. తెలంగాణ ఏర్పాటు నాటికి రూ.75,577 కోట్ల అప్పు ఉందని వెల్లడించింది. తమ ప్రభుత్వం వచ్చాక రూ.42 వేల కోట్ల బకాయిలు చెల్లించినట్లు చెప్పింది.

# సంపాదకీయం

## 'మేకిన్ ఇండియా' విఫలమా? సఫలమా?

మేకిన్ ఇండియా-2014-19 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా వినిపించిన నినాదం ఇదే. కేంద్ర మంత్రుల నుంచి రాష్ట్రాల్లోని బీజేపీ నాయకుల వరకు కూడా .. మేకిన్ ఇండియాకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. దీనికి కారణం.. కొత్తగా అప్పట్లో అధికారం లోకి వచ్చిన ప్రధాని మోడీ.. స్వదేశీ వస్తువుల వినియోగానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో మేకిన్ ఇండియా కార్యక్రమం ఉవ్వెత్తున సాగింది. అప్పట్లో మేకిన్ ఇండియా పేరుతో కొత్త రుణాలు కూడా ఇచ్చారు. అయితే.. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను కొంత లోతుగా పరిశీలిస్తే.. మేకిన్ ఇండియా విఫలమైనట్టే కనిపిస్తోంది. కానీ, 2014-19 మధ్య కాలంలో ప్రవేశ పెట్టిన ఐదు బడ్జెట్లలో మేకిన్ ఇండియాకు పెద్ద ఎత్తున పన్నుల రాయితీ ప్రకటించారు. ప్రోత్సాహకాలు ఇచ్చారు. ప్రధాని ఎక్కడికి వెళ్లినా.. మేకిన్ ఇండియా గురించే చెప్పేవారు. కానీ.. దీని ద్వారా.. ప్రపంచ దేశాల నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లను భరించలేని పరిస్థితి వచ్చినట్టుగా కనిపిస్తోంది. నిజానికి చైనా.. భారతీయ బొమ్మల రంగాన్నే కాకుండా.. పటాకుల రంగాన్ని కూడా ఆక్రమించేసింది. ఇప్పుడు సెల్ ఫోన్లు, దుస్తుల రంగాన్ని కూడా ఆక్రమించింది. దీనికి ఆటకట్టించే ఉద్దేశంతోనే మేకిన్ ఇండియా జపం చేసిన.. మోడీ.. ఇప్పుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్లో మాత్రం విదేశాలకు పెద్ద పీట వేశారు. ఎంతగా అంటే.. రెడ్ కార్పెట్ పరిచేంతగా.! ఈ-కామర్స్ సంస్థలకు టీడీఎస్ తగ్గించారు. తద్వారా.. విదేశీ వస్తు విపణిని ఇంట్లోకే తెచ్చేసినట్టు అయింది. ఆన్‌లైన్ షాపింగ్‌లో తగ్గనున్న ధరలు: ద్వారా.. స్థానిక ఉత్పత్తుల మార్కెట్లు నేల మట్టం ఖాయం. ఇప్పటికే మేకిన్ ఇండియా దెబ్బకొట్టిందనే వాదన ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మరింతగా దేశీయ వస్తు తయారీ రంగం నిలువునా మునిగిపోతుంది. క్యాపిటల్ గెయిన్స్ విధానం సరళీకరణ: ఇది.. విదేశీ వ్యాపార వేత్తలకు కొంగు బంగారం. తద్వారా.. దేశీయంలో మరింత పోటీ ఏర్పడడం ఖాయం. వజ్రాల వ్యాపారాల్లోకి విదేశీయులు: దేశంలో ఎక్కడైనా విక్రయించుకునే.. ప్రాసెస్ చేసుకునేందుకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించారు. దీంతో ఈ రంగంపై ఆధారపడిన దేశీయ మార్కెట్ ఒడిదుడుకులకు గురి కానుంది. ఎలా చూసుకున్నా.. మేకిన్ ఇండియా విఫలమైందనేది సుస్పష్టం.

## పరిశ్రమలకు అనుకూలంగా అత్యుత్తమ వృత్తి నైపుణ్యులుగా తీర్చిదిద్దడమే విశ్వవిశ్వాని లక్ష్యం




శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులను పరిశ్రమలకు అనుకూలం గా అత్యుత్తమ వృత్తి నైపుణ్యులుగా తయారు చేయడమే విశ్వవిశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మనేజ్మెంట్ (వివిఐఎస్ ఎం) గ్రూప్ లక్ష్యమని అధ్యక్షుడు వెంకటేశ్వరరావ్ తెలిపారు. గురువారం శామీర్ పేట మండలం తూముకుంట పరిధిలోని విశ్వవిశ్వాని కళాశాల లో పీజీ డీఎం 2024-26 బ్యాచ్ ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల్లో పీజీడిఎం కోర్సుల్లో విద్యార్థులకు ఎంతో నైపుణ్యత కలిగిన స్కిల్స్ ను నేర్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక జ్ఞానాన్ని, ముఖ్యమైన నైపుణ్యాలను మెరుగుపర్చడం, బలమైన కమ్యూనికేషన్ సామర్థ్యాలను అభివృద్ధి పరుస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సమాజంపై సానుకూల ప్రభావం చూపగల సమగ్ర వ్యక్తులను పోషించడంలో తమ కళాశాల పాత్ర ఎంతగానో ఉంటుందని తెలిపారు.

తమ కళాశాల్లో ప్రారంభిం చిన పీజీడి ఎం నూతన బ్యాచ్ విద్యార్థులు వ్యాపార ప్రపంచానికి విశేషంగా సహకరించగల సత్తా ఉన్న వారిగా రూపొందుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వేడుకల సందర్భంగా కళాశాలకు చెందిన నూతన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల పీజీడి ఎం డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణకుమార్, అసోసియేట్ డీన్ జయశ్రీ, అధ్యా పకులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు పరిశ్రమ నేతలు పాల్గొన్నారు.





## ఇళ్ల నిర్మాణంపై గుడ్ న్యూస్..

### రైతులకు గుడ్‌న్యూస్.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్‌లో భారీ కేటాయింపులు..

తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చర్యల కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో తెలంగాణ రైతాంగం ఎంతో నష్టపోయిందని.. రైతు సాధికారత దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని తక్కువ కాలంలోనే నిరూపించామని భట్టి విక్రమార్క తన ప్రసంగంలో తెలిపారు. వివిధ రంగాలకు కేటాయింపులను ఆయన సభలో వివరించారు. మొత్తంగా రూ.2, 91, 191 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

**రైతులకు గుడ్ న్యూస్..** తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యానవన పంటలకు ప్రోత్సహం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో రూ.737 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో నకిలీ విత్తనాల కారణంగా రైతాంగం నష్టపోయిందని.. తమ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క సభలో ప్రకటించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సన్నవడ్లు పండించే రైతులకు క్వింటాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా రైతు దిగుబడిని పెంచుకునేందుకు వీలుగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. టెక్నాలజీని వ్యవసాయానికి అనుసంధానిచడం తమ ప్రభుత్వ ప్రాధాన్యతగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లు..** గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పూటగడవని నిరుపేదలకు గూడు సమకూర్చడం ప్రభుత్వ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరుపేదలకు ఎన్నో ఆశలు కల్పించి.. ఇళ్లు కేటాయించకుండా దగా చేసిందన్నారు. పేద ప్రజల సొంతింటి కళను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించామన్నారు. పేద ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల సాయం అందించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## తవ్వినకొద్దీ అవినీతి!



కామారెడ్డి : మాక్లూర్ సహకార సంఘం అక్రమాలకు నిలయంగా మారింది. అన్నదాతల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కొంత మంది సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డగోలుగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. కొంత కాలంగా సాగిన వారి అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి. అనుమతులు లేకుండా గోదాముల నిర్మాణాలు, అనామత్ ఖాతాల పేరిట ఈపాటికే రూ.కోటికి పైగా గోల్‌మాల్ జరిగింది. తాజాగా ఎరువుల అమ్మకాల్లో పెద్ద ఎత్తున డబ్బులు స్వాహా అయినట్లు తెలిసింది. మరో ఐదు కేంద్రాల్లో అక్రమాలు..జిల్లాలోనే అతి పెద్ద విండోగా పేరొందిన మాక్లూర్ పరిధిలో 26 గ్రామాలకు చెందిన 5వేలకు పైగా సభ్యులుంటారు. వారి సౌకర్యార్థం గుత్ప, డీకంపల్లి, మాక్లూర్, కల్లెడి, గొట్టుముక్కల, చిక్లి కేంద్రాల్లో ఎరువులు అమ్ముతుంటారు. ఆరు నెలల క్రితం గుత్పలో రూ.31లక్షల విలువైన ఎరువుల సంచులను సర్కారు నిల్వ ఉంచగా.. ప్రస్తుతం కేవలం రూ.2.67లక్షల విలువైన సంచులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రూ.28.34లక్షల ఎరువులు అమ్ముడు పోగా..ఇందుకు సంబంధించిన సొమ్మును సిబ్బంది బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. ఈ అవినీతి తతంగాన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. ఇక మరో ఐదు కేంద్రాల్లోనూ ఎరువుల అమ్మకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు విశ్వాసనీయ సమాచారం. మాక్లూర్‌లో రూ.18.50లక్షల విలువైన ఎరువులను నిల్వ ఉంచగా..రూ.2.33లక్షల స్టాకు మాత్రమే ఉంది. అన్నదాతలకు అమ్మిన రూ.16.17లక్షల విలువైన ఎరువుల డబ్బును కొందరు కాజేశారు. కల్లెడిలో రూ.11.50లక్షలు, డీకంపల్లిలో రూ.4.16లక్షలు, గొట్టుముక్కలలో రూ.3.06లక్షలు, చిక్లిలో రూ.7.27లక్షలు దుర్వినియోగమైనట్లు ఆడిట్‌లో తేలింది. ఈ లెక్కన మొత్తం మీద ఆరు కేంద్రాల్లో జరిగిన ఎరువుల అమ్మకాల్లో రూ.70లక్షలకు పైగా అవినీతి జరిగిందన్న మాట.వారంలోగా రికవరీ చేస్తాం

ఎరువుల డబ్బులు దండుకున్న వారి నుంచి వారం రోజుల్లోగా రికవరీ చేస్తాం. రైతులు ఎలాంటి ఆందోళనకు లోను కావొద్దు. ఇక నుంచి పొరపాట్లు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. సహకార సంఘం బలోపేతం కోసం కృషి చేస్తాం. - బూరొల్ల అశోక్, విండో ఛైర్మన్

## మేడిగడ్డ సందర్శనకు వెళ్తూ అలియాబాద్ చౌరస్తా లో కాసేపు సేద తీరని కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

శామీర్ పేట, (గరుడ వార్త) : మేడిగడ్డ సందర్శనకు వెళుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం మార్గమధ్యంలోని అలియాబాద్ చౌరస్తా లోనున్న సిఎంఆర్ కన్వెన్షన్ లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఏర్పాటుచేసిన విందులో పాల్గొని భోజనం చేశారా. గురువారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని మాజీ మంత్రి మల్లారెడ్డి కి చెందిన సిఎంఆర్ కన్వెన్షన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం కాసేపు ఆగి భోజనం చేసుకొని వెళ్లారు. కేటీఆర్







వెంట మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు లు కాన్వాయిగా తరలి వెళ్లారు. వీరికి మాజీ జడ్పీటిసి అనిత ఎంపీపీ ఎల్లుబాయి బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వారసుల పేరుతో.. రూ.కోట్ల భూమి కాజేత!

ఆసిఫాబాద్: దశాబ్దాల నుంచి వివాదంలో ఉన్న వందల ఎకరాల భూమిపై ఓ స్థిరాస్తి వ్యాపారి కన్నుపడటంతో.. అన్నీ ఆయనకు అనుకూలంగా మారిపోయాయి. రహదారి పక్కన ఉన్న రూ.కోట్ల విలువ చేసే భూములను దొడ్డిదారిన కాజేసి, వెంచర్ వేయడంతోపాటు, మరో నేతకు విక్రయించడంతో భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు తిలోదకాలిచ్చి కొనసాగుతున్న ఈ తంతులో రెవెన్యూ అధికారులందరూ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, రోజుకొకరికి పట్టాలు పుట్టుకురావడంతో.. ప్రజలు విస్తుపోతున్నారు. అన్నీ సక్రమంగా ఉండి, చిన్నపాటి పొరపాట్లను (అధికారులు చేసినవే, పేర్లు చిరునామాల సవరణ) సరిదిద్దడానికి నానా ఇబ్బందులు పెట్టే రెవెన్యూ వర్గాలు.. ఇక్కడ మాత్రం ఠంచనుగా పట్టాలు జారీ చేయడం గమనార్హం. వాంకిడి కలాన్‌లో లతీఫొద్దీన్ పేరు మీద 110 ఎకరాల భూమి ఉంది. నిజాం కాలం నుంచి ఆయన పేరు మీదే ఉంది. కాలక్రమేణా ఆయన ఇతర దేశాలకు వెళ్లి స్థిరపడి అక్కడే కన్నుమూశారు. అయితే ఈ భూములను స్థానిక రైతులు.. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో తమ పేరుమీద పట్టా చేయాలని రైతులు అనేకసార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోయారు. ఈ తరుణంలో బడా స్థిరాస్తి వ్యాపారి కన్ను ఈ భూమిపై పడింది. భూములకు సంబంధించి విదేశాల్లో ఉన్న వారసులను రంగంలోకి దించాడు. ఆర్డీఓ ట్రైబ్యూనల్ సహకారంతో 60:40 శాతంగా 45 ఎకరాల వరకు భూములను స్థిరాస్తి వ్యాపారి, బినామీలు, కొందరు మధ్యవర్తులు అయిదు నెలల కిందట పంచుకున్నారు. ఏడాది కిందటే..సరిగ్గా ఏడాది కిందట అప్పటి ఆర్డీఓ ఆధ్వర్యంలో ఈ తంతు జరగగా.. శాసనసభ ఎన్నికలకు ముందు అప్పటి అధికారులు అందరూ హడావుడిగా పట్టాల జారీకి పచ్చజెండా ఊపారు. సర్వే నం. 31, 32, 33, 34, 46, 59, 60, 61లలో 110 ఎకరాల భూమి లతీఫొద్దీన్‌కు నిజాం కాలం నుంచి ఉండగా.. రహదారి పక్కనే ఉన్న సర్వే నం.59, 60, 61 లోని భూములను వారసుల పేరు మీద, అనంతరం స్థానిక నేత, స్థిరాస్తి వ్యాపారి తమ పేరు మీద మార్చుకున్నారు. స్థానిక నేత భారీ ఫంక్షన్‌హాల్‌ను పంట పొలాల్లోనే నిర్మిస్తుండగా.. వ్యాపారి వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించేశాడు. ఇంత జరుగుతున్నా.. స్థానిక, జిల్లా రెవెన్యూ అధికారులు ఎవరూ నిలువరించకపోవడం విశేషం. మరోవైపు దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న మిగతా రైతులు పట్టాల కోసం కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం కొసమెరుపు.

అసలెలా జరిగింది..వాంకిడి మండల కేంద్రానికి సమీపంలో లతీఫొద్దీన్‌కు సంబంధించిన ఈ భూములు ఉన్నాయి. రహదారి పక్కనే ఉన్న దాదాపు 20 ఎకరాల వరకు రైతుల నుంచి స్థిరాస్తి వ్యాపారి, స్థానిక నేత, ఇద్దరు దళారులు తీసుకున్నారు. పట్టాలు వచ్చాయని, ఉన్న భూమి లాక్కుంటారనే భయం, డబ్బులపై ఆశ ఇలా వివిధ కారణాలతో కొందరు రైతులు తాము సాగు చేసుకుంటున్న దాంట్లో 40 శాతం భూమిని వారికి ఇచ్చేశారు. ఇక్కడే అసలు తిరకాసు నెలకొంది. వాస్తవంగా లతీఫొద్దీన్‌కు సంబంధించి 110 ఎకరాల భూమి మోకా మీద ఉన్నా.. ధరణిలో కేవలం 45 ఎకరాల వరకే ఉంది. అంటే ఆర్డీఓ ట్రిబ్యూనల్ చెప్పిన ప్రకారం.. 60 శాతం కాస్తుదారులకు, 40 శాతం పట్టాదారులకు చెందేలా ఉత్తర్వులు జారీచేశారు. అయితే మిగతా 65 ఎకరాలు ధరణిలో నమోదు చేసిన అనంతరమే పూర్తి భూమికి అంటే 110 ఎకరాలకు 60:40 శాతంగా సర్వేయర్‌తో కొలతలు తీసి హద్దులు ఏర్పాటు చేసి పంచాల్సి ఉంది. కానీ అలా కాకుండా రహదారి పక్కనే ఉన్న స్థలాన్ని పట్టాలుగా తమకు అనుకూలంగా మల్చుకుని స్థిరాస్తి వ్యాపారి, స్థానిక నేత సొమ్ము చేసుకుంటున్నారు.

# అతివలకు ఆర్థిక పరిపుష్టి

నిర్మల్ : అతివల్లో ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో కన్న మెరుగైన యూనిట్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ముమ్మరం చేయాలని జిల్లా పాలనాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు నిర్మల్ జిల్లాలో రుణ వార్షిక ప్రణాళిక రూపొందించి లబ్ధిదారుల ఎంపిక, రుణ పంపిణీకి జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ నేతృత్వంలో డీఆర్డీవో విజయలక్ష్మి క్షేత్ర స్థాయిలో కసరత్తు ప్రారంభించారు. డీపీఎం, ఏపీఎం, సీసీలు, వీవోఏలకు రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 18 మండలాల్లో 4,051 మంది స్వయం సహాయక సభ్యులకు రుణాలు అందించాలని ప్రతిపాదనలు రూపొందించారు. 3,357 యూనిట్లకు రూ.19.40 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం నిర్దేశించారు. 12 రకాలు రుణాలు అందించనున్నారు.

సూక్ష్మ రుణాల కింద జిల్లాలో 7,268 యూనిట్లకు రూ.8.27 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. వీటికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. యూనిట్ల నిర్వహణకు బ్యాంకులు, స్త్రీనిధి, మండల సమాఖ్యల ద్వారా రుణ సాయం అందిస్తున్నారు.



లక్ష్యాన్ని సాధిస్తాం:విజయలక్ష్మి, డీఆర్డీవో, నిర్మల్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడానికి క్షేత్ర స్థాయిలో కసరత్తు కొనసాగుతోంది. గతంలో కన్న ప్రస్తుతం కొత్త యూనిట్లు మంజూరు చేస్తున్నాం. సంచార చేపల విక్రయ కేంద్రాలకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 60 శాతం రుణం మంజూరవుతోంది. మరో 40 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. రుణాలు పొందడానికి స్వశక్తి సభ్యులు ముందుకొస్తున్నారు. మార్చి 2025 నాటికి లక్ష్యాన్ని మించి రుణ పంపిణీ చేస్తాం.

మహిళా శక్తి నిధులతో ఉపాధి:అంకం లావణ్య, నీలాయిపేట్, నిర్మల్ మండలం

నేను మణికంఠ స్వశక్తి సంఘం సభ్యురాలిని. వస్త్ర దుకాణం ఏర్పాటుకు రుణం కావాలని వీవోఏ సుస్మిత దృష్టికి తీసుకెళ్లాను. మండలంలో ఐకేపీ సీసీ కిరణ్మయితో చర్చించి రూ.3 లక్షలు మంజూరు చేశారు. వీటితో వస్త్ర దుకాణం ప్రారంభించాను. దీంతో ఉపాధి మార్గం సులువైంది. వ్యాపార మెలకువలు తెలుసుకున్నాను. గ్రామస్థులందరూ నా వద్ద కొనుగోలు చేస్తున్నారు. పెద్ద మొత్తం రుణం ఇవ్వడం వల్ల వ్యాపారం నిర్వహిస్తున్నాను.

# ప్రధాన హామీ.. పరిష్కార దారి!

నిర్మల్ : ఉమ్మడి జిల్లాలో చాలా సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారం కావడం లేదు. ఈ సమస్యలను గుర్తించిన ప్రజాప్రతినిధులు శాసనసభ ఎన్నికల సమయంలో తాము గెలిస్తే అమలు చేసే ప్రథమ ప్రాధామ్యాలను వెల్లడించారు. అయితే లోక్‌సభ ఎన్నికల తరువాత పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రధాన హామీలు ఏమిటి.. వాటి పరిష్కారానికి ఏం చేస్తారు.. ఈ బడ్జెట్ సమావేశాల్లో వారు ఏం గళం వినిపించనున్నారో వివరాలతో 'న్యూస్‌టుడే' కథనం.

సమస్యలు: బోధకుల కొరత, మెస్, తదితర సమస్యలతో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బాసర ఆలయం అభివృద్ధి నోచుకోక భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ముథోల్ సామాజిక ఆసుపత్రిలో రోగులకు కనీస వసతులు లేవు.

గడ్డెన్న వాగు ప్రాజెక్టు ప్రధాన కాలువ లైనింగ్ లేక శిథిలావస్థకు




చేరింది. ప్రాజెక్టు వెనుక వరదనీరు గుండేగావ్‌లోకి వచ్చి చేరుతోంది. అక్కడ నివసించే వారంతా భైంసాలో ఏర్పాటుచేసే తాత్కాలిక పునరావాస ప్రాంతానికి వస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు 28 ప్యాకేజీ కింద ఎస్సారెస్పీ ద్వారా ముథోల్ నియోజకవర్గంలో చేపట్టిన సాగునీటి కాలువల పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు.ఎమ్మెల్యే: ఆర్జీయూకేటీకి నిధుల కేటాయింపుతోపాటు రెగ్యులర్ ఉప కులపతి నియమించాలని ప్రభుత్వానికి విన్నవిస్తా. గడ్డెన్నవాగు ప్రధాన కాలువ మరమ్మతులకు నిధుల కోసం పోరాడుతా. గడ్డెన్నవాగు ప్రధాన కాలువ మరమ్మతులు, బాసర అమ్మవారి క్షేత్రం అభివృద్ధికి నిధుల కోసం ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించి మంజూరు కోసం కృషి చేస్తా.

**విద్య, వైద్యం అందించడమే ధ్యేయం**

స్వర్ణ ప్రాజెక్టు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. జౌలినాల, కుడి, ఎడమ కాలువలకు లైనింగ్ లేక శిథిలావస్థకు చేరాయి. సదర్మాట్ బ్యారేజీ పనులు పూర్తిస్థాయిలో చేయడానికి మరిన్ని నిధులు అవసరం. నియోజకవర్గంలోని 22 ఎత్తిపోతల పథకాల్లో నాలుగే పనిచేస్తున్నాయి. స్వర్ణవాగు ప్రవాహంతో భారీ వర్షాలకు కురిసిన ప్రతిసారి నిర్మల్‌లోని జి.ఎన్.ఆర్.కాలనీ, కౌట్ల(కె) సమీపంలో కొత్తగా నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల ప్రాంతం ముంపునకు గురవుతుంది. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. ఎమ్మెల్యే: సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తా. స్వర్ణ ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణ, ఎత్తిపోతల పథకాలను ఉపయోగంలోకి తీసుకరావడానికి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నా. సదర్మాట్ పూర్తిస్థాయి పనులకు రూ.42 కోట్లు మంజూరు చేయించా. ఈ నిధులతో పనులన్నీ పూర్తవుతాయి.

జి.ఎన్.ఆర్.కాలనీ, రెండు పడక గదుల ఇళ్ల ప్రాంతం ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారం కోసం పనులు చేయిస్తా. కాలనీలోకి వరదనీరు రాకుండా రక్షణ చర్యలు చేపట్టడానికి అవసరమైన నిధులు తీసుకొచ్చేలా ప్రయత్నం చేస్తా.

# సాగు పెరిగితేనే.. వంటింటికి కళ..!



భానుపురి : కూరగాయల ధరలు ఓసారి పెరుగుతూ.. మరోసారి తగ్గుతూ ఉంటాయి. వీటిలో నిలకడ అనేది ఉండదు. ఎక్కువ రోజులు అధిక ధరలు ఉంటుండటంతో వినియోగదారులు తల్లడిల్లుతున్నారు. ఒక్కోసారి సామాన్యులు కొనలేని దుస్థితి నెలకొంటోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కూరగాయల సేద్యం అంతగా ఉండదు. ఎక్కువగా వరి, పత్తి, అంతర పంటలుగా అపరాలను పండిస్తారు. ఇలా సాగు తగ్గడం, ఇతర ప్రాంతాల్లో పండే కూరగాయల దిగుమతిపై ఆధారపడటంతో జిల్లాలో ధరల్లో స్థిరత్వం ఉండటం లేదు. ఈ వానాకాలంలో సాగు పెంచితే సామాన్యులకు మేలు చేసిన వారవుతారు.

**18 వేల ఎకరాల్లో సేద్యం అవసరం**

ఉమ్మడి జిల్లా అవసరాలకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 18 వేల ఎకరాల్లో కూరగాయలు పండించాల్సిన అవసరం ఉందని మార్కెట్ అధికారులు పేర్కొంటున్నారు. అంటే ప్రతి జిల్లాలో కనీసం ఆరు నుంచి ఏడు వేల ఎకరాల్లో సాగు చేపట్టాలి. అప్పుడే ధరలు స్థిరంగా ఉంటాయి. కానీ, ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల్లోనే రైతులు పండిస్తున్నారు. జిల్లా జనాభాకు అనుగుణంగా సాగు లేకపోవడంతో 40-70 శాతం వరకు కూరగాయలను ఇతర జిల్లాలు, పొరుగు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చే క్రమంలో చెడిపోవటం, స్థానికంగా నిల్వ చేసే వీలులేక ధరలు అమాంతం పెరిగి వినియోగదారులపై ఆర్థిక భారం పడుతోంది.

దిగుమతే కారణం

నర్సింహ, మేళ్లచెరువు

జిల్లాలో కూరగాయల పంటలు పండే సమయంలో ధరలు ఉండవు. మన దగ్గర సాగులేని కాలంలో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నప్పుడు ధరలు అధికంగా ఉంటున్నాయి. కూరగాయల సాగుపై రైతులకు అవగాహనతోపాటు ప్రోత్సాహం లేక దృష్టిసారించడం లేదు. అధికారులూ శ్రద్ధ చూపకపోవడంతో సాగు తగ్గి ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఇలా ప్రోత్సహించాలి..

కూరగాయల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం చాలా అవసరం. ఎందుకంటే విత్తనాల ధరలు ఎక్కువగా ఉంటాయి. గతంలో మాదిరిగా 50 శాతం రాయితీపై విత్తనాలను రైతులకు సరఫరా చేయాలి.

జిల్లా జనాభాకు అనుగుణంగా రాయితీపై 250 ఎకరాల్లో పాలీహౌజ్‌లు మంజూరు చేయాలి.

హరిత పందిరి(షేడ్‌నెట్), బిందు, తుంపర సేద్య పరికరాలు, మల్చింగ్ షీట్లు, పందిళ్ల స్తంభాలు, తీగలు, కూరగాయలు తరలించే ప్లాస్టిక్ పెట్టెలను రాయితీపై పంపిణీ చేయాలి.

పంటల బీమా వర్తింపజేయాలి.

శీతల గిడ్డంగుల వసతిని కల్పించాలి.

వానరాల బెడద నివారించాలి.

రైతు బజార్లు, సమీకృత మార్కెట్లలో రైతులకే విక్రయ అవకాశాలు కల్పించాలి.

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు వివరాలు (ఎకరాల్లో)

సూర్యాపేట 350

నల్గొండ 280

యాదాద్రి 100

కోతుల కారణంగా రైతులు ముందుకు రావటం లేదు

అన్నపూర్ణ, ఉద్యాన శాఖాధికారిణి, యాదాద్రి

రైతులకు కూరగాయల సాగుపై ఆసక్తి ఉన్నప్పటికీ కోతుల భయానికి ముందుకు రావడం లేదు. పంటలు పండిన తర్వాత వానరాలు నాశనం చేస్తుండటంతో నష్టం వస్తోందని చాలామంది రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కూడా కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సూచనలు, సలహాలు అందిస్తోంది.

# పరమ 'చెత్త'గా..




ఖమ్మం :నగరపాలిక, పురపాలికల్లో చెత్త సేకరణ నామమాత్రంగా మారటం, మురుగుకాల్వల నిర్వహణ గాడి తప్పటంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. చాలాచోట్ల చెత్త సేకరణ వాహనాల కొరత వేధిస్తోంది. ఉన్నవి మరమ్మతులకు గురవుతున్నా వాటిని పట్టించుకునే వారు కరవయ్యారు. ఒక్కో వార్డుకు లేదా కాలనీకి కనీసం వారానికోసారైనా చెత్త సేకరణ వాహనాలు వెళ్లకపోవటం గమనార్హం. అవసరమైనచోట్ల చెత్త డబ్బాలు లేకపోవటంతో వీధులు, రహదారుల వెంట స్థానికులు చెత్తాచెదారం పారబోస్తున్నారు. అసలే వానాకాలం.. ఆపై వ్యాధులు ముసురుతుండటంతో తమ జేబులు గుల్లవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నగరంలో వానాకాలంలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. డివిజన్ల వారీగా పనిచేస్తున్న కార్మికులకు అదనంగా మరో ఇద్దరిని కేటాయించాం. కార్పొరేషన్ వాహనాలతోపాటు ప్రైవేటు ట్రాక్టర్లు వినియోగిస్తున్నాం. మురుగునీరు నిలవకుండా కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించాం. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఖమ్మం నగరంలో సుమారు లక్ష వరకు నివాసాలున్నాయి. అనేక వార్డుల్లో రోజుల తరబడి చెత్త సేకరించకపోవటం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రైతుబజార్లు, కూరగాయల మార్కెట్ల వద్ద పరిస్థితి అధ్వానంగా తయారైంది.వైరా పట్టణం ఏడేళ్ల క్రితం పురపాలికగా మారినా ఇప్పటివరకు డంపింగ్‌యార్డు లేదు. సేకరించిన చెత్తను ఎక్కడ పడేయాలో తెలియని పరిస్థితి. అడపాదడపా చెత్తను సేకరిస్తున్నారు. కొన్ని చెత్త సేకరణ వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. శివారు గ్రామాలు అధిక సంఖ్యలో ఉన్నా రోజువారీగా చెత్త సేకరణ సాగటం లేదు. మురుగుకాల్వల పరిస్థితి దయనీయంగా మారింది.

మధిర పట్టణంలో మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా తయారైంది. 22 డివిజన్లకు పారిశుద్ధ్య కార్మికులు 110 మంది అవసరమైనా 60 మందితోనే నెట్టుకొస్తున్నారు. మూడు, నాలుగు రోజులకోసారి కాలనీల వారీగా చెత్త సేకరిస్తున్నారు. మురుగుకాల్వల్లో పూడిక పేరుకుపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండటం గమనార్హం.

కొత్తగూడెం పురపాలికలోని 36 స్వచ్ఛ వాహనాలు ఉన్నాయి. కొన్ని మరమ్మతులు గురవటంతో రోజువారీగా చెత్త సేకరించే పరిస్థితి లేదు. ప్రధాన వీధులు, కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. మురుగుకాల్వల్లో పూడిక తీయకపోవటంతో చిన్నపాటి వర్షం కురిసినా రహదారులపైకి వ్యర్థపు నీరు చేరుతోంది.

# త్వరలో.. మహిళా శక్తి క్యాంటీన్లు

నల్గొండ : గ్రామీణ ప్రాంత అతివల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. మహిళా శక్తి పథకంలో భాగంగా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశించింది. మెరుగైన ప్రగతి, ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండి, వ్యాపార నిర్వహణ సామర్థ్యం గల సంఘాలను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ గుర్తిస్తోంది. వీటిలో మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయం, దేవరకొండ, నకిరేకల్ ఎంపీడీవో కార్యాలయాల్లో, నల్గొండ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేయించనున్నారు. ప్రభుత్వ ఖాళీ భవనాల కొరత ఉంటే ఆయా చోట్ల ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

**స్త్రీ నిధి పథకం కింద సాయం**

క్యాంటీన్ల నిర్వహణలో మహిళలను వందశాతం భాగస్వాముల్నిచేస్తారు. ఆహార పదార్థాలను ఇళ్ల వద్ద తయారుచేసి క్యాంటీన్లకు తరలిస్తారు. ఆర్డర్లపై పిండివంటలు, మిఠాయిలు, పచ్చళ్లను తయారుచేసి విక్రయిస్తారు. శుభకార్యాలకు అవసరమైన వంటలనూ తయారుచేయవచ్చు. రుచికరమైన వంటకాల తయారీలో అనుభవం, వ్యాపార దక్షత గల సంఘాలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి అధికారులు చెబుతున్నారు. ఎంపికైన సంఘాల సభ్యులకు శిక్షణ సైతం అందిస్తారు. అనంతరం ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటుకు స్త్రీనిధి పథకం కింద రూ. 10 లక్షల నుంచి 20 లక్షల వరకు నాలుగు శ్లాబ్‌లలో రుణాలు మంజూరు చేయిస్తారు.




**సంఘాల అభ్యున్నతికి...**

నాగిరెడ్డి, డీఆర్డీవో, నల్గొండ

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి వివిధ పథకాల కింద కార్యక్రమాలు చేపడుతున్నాము. తాజాగా అయిదు క్యాంటీన్ల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం అర్హత గల సంఘాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. దశలవారీగా అర్హత సంఘాలతో వ్యాపారాలు ఏర్పాటు చేసే ఆలోచన చేస్తున్నాము.

# వానలకు తోడు.. వ్యాధుల జోరు

ఉట్నూరు : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరు వానలకుతోడు.. ఏజెన్సీలో వ్యాధులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వైద్యులు, సిబ్బంది లేమి, మందుల కొరత, పారిశుద్ధ్యలోపం, కలుషిత నీటి కారణంగా కీటక, నీటి జనిత వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఏజెన్సీ వైద్యశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్‌శాఖల అధికారుల సమన్వయ లోపంతో మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు విషజ్వరాలు, అతిసారం బారినపడి ఆసుపత్రుల బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటి ఆధ్వర్యంలో ఆరోగ్య ఉప కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రాలతోపాటు మారుమూల ఆదివాసీగూడాలు, గిరిజన తండాలలో పర్యటిస్తూ.. ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ వైద్య సేవలు అందించాల్సి ఉంటుంది. ఏజెన్సీ వైద్యశాఖతో కలిసి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అధికారులు పని చేసి కాలానుగుణ వ్యాధులను అరికట్టాలని కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించి ఆదేశించినా పకడ్బందీ చర్యలు మాత్రం కొరవడ్డాయి.

పారిశుద్ధ్యలోపం..గ్రామాల్లో పందుల సంచారంతోపాటు చెత్తాచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. దోమలు, క్రిమికీటకాలు పెరిగి వ్యాధులను వ్యాప్తి చెందిస్తున్నాయి. వానాకాలం ప్రారంభానికి ముందే మిషన్ భగీరథ ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలకు శుద్ధజలం అందించాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సక్రమంగా నీటి సరఫరా లేక కలుషిత నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. బావులు, చేతిపంపులే దిక్కవుతున్నాయి.

అవగాహన కార్యక్రమాలేవి?

మారుమూల గ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులు వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి గోండు, లంబాడా, కొలాం భాషల్లో కళాజాత బృందాలతో చేపట్టాల్సిన అవగాహన కార్యక్రమాల ఊసేలేదు. దోమల నివారణకు ఇంటింటా పిచికారీ చేయడానికి మందులు లేకపోవడం గమనార్హం.

ఈ చిత్రంలోని బాలుడి పేరు త్రినేష్. కుమురం భీం జిల్లా జైనూరు మండలానికి చెందిన ఇతడు మూడు రోజుల నుంచి టైఫాయిడ్‌తో బాధపడుతున్నాడు. తొలుత స్థానిక పీహెచ్‌సీకి, తర్వాత ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడిని ఉట్నూరు ఆసుపత్రికి తీసుకొచ్చి వైద్యం అందిస్తున్నారు.

ఉట్నూరు మండలం కొమ్ముగూడకు చెందిన సేవాలాల్, శాంత దంపతుల రెండేళ్ల చిన్నారి హరిలాల్ వాంతులు, విరేచనాలతో సతమతమవుతున్నాడు. తల్లిదండ్రులు ఆ బాలుడిని ఉట్నూరు దవాఖానాలో చేర్పించారు. ఏజెన్సీలో వ్యాధుల వ్యాప్తి చాపకింద నీరులా విస్తరిస్తోంది అనడానికి ఇవి ఉదాహరణలు మాత్రమే..

అరకొర మందులు.. సిబ్బంది కొరత..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత నెలకొంది. అరకొర మందులతో నెట్టుకొస్తున్నారు. యాంటీబయోటిక్స్, విరేచనాలను అరికట్టే మందులు, సెలైన్ సీసాలు వంటివి లేక ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు. ఏజెన్సీ వైద్యశాఖను సిబ్బంది కొరత వెంటాడుతోంది. 31 పీహెచ్‌సీల్లో 73 వైద్యుల పోస్టులు మంజూరై ఉండగా ప్రస్తుతం 46 మంది వైద్యులు ఉన్నారు. ఇంకా 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 129 బహుళార్ధ ఆరోగ్య సహాయకులు(మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్, 5 స్టాఫ్‌నర్సులు, 20 బహుళార్ధ ఆరోగ్య పర్యవేక్షకుల(సూపర్‌వైజర్స్) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వ్యాధులు నిర్ధారించే ల్యాబ్ టెక్నీషియన్లు లేక ఉట్నూరులో ఆర్భాటంగా ప్రారంభించిన డయాగ్నోస్టిక్ కేంద్రం వెలవెలబోతోంది. ఆధునిక పరికరాలున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

మెరుగైన సేవలు అందిస్తున్నాంకుడ్మెత మనోహర్, ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి ప్రతి రోజు గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్య బృందం పర్యటిస్తుంది. వ్యాధిగ్రస్థులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.

# అందుబాటులో డయాలసిస్ కేంద్రం

తూప్రాన్: తూప్రాన్‌లో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 50 పడకల ఆస్పత్రి ఆవరణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఈ కేంద్రం ఏర్పాటు చేసేందుకు వైద్యాధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ భవనంలోనే రక్త నిల్వల కేంద్రాన్ని సిద్ధం చేశారు. ఇందులోనే అనువైన గదులను చూసి డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి సేవలు అందించనున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికను పంపించారు. సంబంధిత అధికారుల నుంచి ఆదేశాలు రాగానే సేవలు అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. వీలైనంత త్వరగా ఇక్కడ సేవలు ప్రారంభించేలా అధికారులు, పాలకులు చొరవ తీసుకుంటే పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన బాధితులకు ఎంతో మేలు చేకూరుతుంది.

జిల్లా కేంద్రంలో ఒకేచోట




జిల్లాలో ప్రస్తుతం మెదక్‌లో మాత్రమే డయాలసిస్ సేవలు అందుతున్నాయి. జిల్లాలోని మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలు సైతం అక్కడికే వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో కేంద్ర బిందువుగా ఉన్న తూప్రాన్‌లో సేవలు ప్రారంభమైతే తూప్రాన్, చేగుంట, మనోహరాబాద్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేటతో పాటు సిద్దిపేట జిల్లాలకు చెందిన బాధితులు సైతం ఇక్కడికే వచ్చే అవకాశం ఉంది. రెండు, మూడు రోజులకు ఒకసారి వెళ్లాల్సి ఉండడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణా వ్యయం, సమయాభావంతో కష్టాలు పడుతున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు వారం రోజులకు, 15 రోజులకు ఒకసారి వెళుతున్నారు. మరికొంత మంది సేవలు పొందలేక ఆరోగ్య క్షీణించి ప్రాణాలు కోల్పోతున్నారు.వీలైనంత త్వరగా సేవలు

తూప్రాన్‌లో డయాలసిస్ సేవలను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు చొరవ తీసుకుంటాం. ఈ మేరకు అధికారులకు నివేదికలను పంపించాం. ముగ్గురు సాఫ్ట్ నర్సులు, ఇద్దరు డయాలిసిస్ టెక్నీషియన్స్, నిమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణ ఉండే ఇద్దరు ఉద్యోగులు కావాల్సి ఉంది. పరికరాలు బిగించి, సిబ్బందిని నియమించగానే సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం.- డా.అమర్‌సింగ్, తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి పర్యవేక్షకులు

# స్త్రీనిధి రుణం.. ఉన్నతికి మార్గం

చెన్నూరు : మహిళలు వివిధ వ్యాపారాల్లో రాణించి ఆర్థికంగా మరింత బలపడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులు చిన్న, మధ్యతరహా వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. వీరు పెద్ద వ్యాపారాలు కూడా చేపట్టేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం సంకల్పించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 11 రకాల వ్యాపారాలు చేపట్టేందుకు ఉమ్మడి జిల్లాలో రూ.273.26 కోట్ల రుణాలు ఇవ్వాలని స్త్రీనిధి బ్యాంకు ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ(డీఆర్డీవో) సెర్ప్ ద్వారా గ్రామాల్లో, మెప్మా ద్వారా పురపాలికల్లో మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యాలు ఖరారయ్యాయి.

స్వయం ఉపాధి యూనిట్లకు ప్రాధాన్యం

మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలు సులభంగా అందుతు



న్నాయి. రుణ వాయిదాలు సక్రమంగా చెల్లించడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఓ వైపు పొదుపు చేస్తూనే మరోవైపు రుణాలతో స్వయం ఉపాధి దిశగా సభ్యులు అడుగులు వేస్తూ కుటుంబ ఉన్నతిలో భాగస్వాములు అవుతున్నారు. వీరికి స్త్రీనిధి రుణాలు తోడు కావడంతో అభ్యున్నతికి బాటలు పడుతున్నాయి. స్త్రీనిధి ద్వారా అందించే రుణాలను స్వయం ఉపాధి యూనిట్లకు మంజూరు చేస్తారు. పెరటి కోళ్ల పెంపకం, పాడి గేదెలు, సోలార్, కొత్త వ్యాపారాలు, వ్యాపార విస్తరణ, తదితర వ్యాపారాలకు రుణాలను అందజేస్తారు. అదేవిధంగా గ్రామాలు, పట్టణాల్లో జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు సైతం రుణ సదుపాయం కల్పిస్తారు.

సమన్వయంతో ముందుకు..

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే లక్ష్యాల సాధనపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ, స్త్రీనిధి అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏ నెలకు సంబంధించిన లక్ష్యాలను అదే నెలలో అధిగమించేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారు.

నిర్మల్ జిల్లాలో అత్యధికం..

మహిళా సంఘాలకు స్త్రీనిధి ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలవారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా నిర్మల్ జిల్లాకు రూ.115.33 కోట్లు కేటాయించారు. అత్యల్పంగా ఆదిలాబాద్‌కు రూ.42 కోట్లను లక్ష్యంగా నిర్దేశించారు. గతేడాది ఉమ్మడి జిల్లాలో నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్‌లలో లక్ష్యానికి మించి రుణాలను అందించారు. కుమురంభీం జిల్లాలో మాత్రం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం సమష్టిగా ముందుకు సాగితే లక్ష్యాలను చేరుకోవడం సులువేనని సంబంధిత అధికారులు భావిస్తున్నారు.

రుణాల సద్వినియోగంపై అవగాహన

మహిళా సంఘాల ఉన్నతికి స్త్రీనిధి ద్వారా రుణాలను మంజూరు చేస్తున్నాం. స్వయం ఉపాధి వ్యాపారాలకు తక్కువ వడ్డీతో ఉన్న చోటే రుణాలు లభిస్తాయి. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. రుణాల సద్వినియోగంపై అన్ని ప్రాంతాల్లో సభ్యులకు అవగాహన కల్పిస్తూ వారి ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్నాం. వెంకటరమణ, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజరు, మంచిర్యాల

# వ్యాపారుల కుమ్మక్కు.. పత్తి విత్తనాలకు ఇక్కట్లు

సంగారెడ్డి : సదాశివపేట మండలం బొబ్బిలిగామకు చెందిన రైతుకు ఎనిమిది ఎకరాల సాగుభూమి ఉంది. ఇటీవల స్థానిక పలువురు విత్తన వ్యాపారులను ఆశ్రయించి పత్తి విత్తనాలు కొనుగోలు చేసే ప్రయత్నం చేశారు. వివిధ రకాల పత్తి విత్తన ప్యాకెట్లు రూ.864(475 గ్రాములు)కు విక్రయించాల్సి ఉండగా.. రూ.1200 నుంచి రూ.1400 వరకు డిమాండ్ చేశారు. ఆ రైతు చేసేది లేక ఝరాసంగం, వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేశాడు. అక్కడా అధిక ధరలకు విక్రయిస్తున్నా.. సదాశివపేటతో పోల్చితే కొంత మెరుగు.

పత్తి విక్రయాలు విక్రయిస్తున్న డీలర్లు, వ్యాపారులు కుమ్మక్కయ్యారు. కృత్రిమ కొరత సృష్టించి రైతులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిత్యం వ్యవసాయ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నా.. రికార్డులు, స్టాకు పరిశీలనకే పరిమితమవుతున్నారని పలువురు కర్షకులు ఆరోపిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోని తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని పలువురు రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.లక్షల్లో దందా: ఈ వానా కాలంలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు అనుగుణంగా విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారు. కొందరు ప్రైవేట్ డీలర్ల వద్ద మాత్రమే పత్తి ప్యాకెట్లు అందుబాటులో ఉండటం.. వారంతా కుమ్మక్కు కావడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. సకాలంలో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు పత్తి విత్తనాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇదే అదనుగా వ్యాపారులు రైతులను అధిక ధరలతో దోపిడీ చేస్తున్నారు. రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల విత్తన ప్యాకెట్లు రూ.864కు మాత్రమే విక్రయించాల్సి ఉండగా.. ఆ దిశగా ఎక్కడా అమలు కావడం లేదు.

జిల్లాలో పత్తి సాగు అంచనా:3.60 లక్షల ఎకరాలు

అవసరమయ్యే విత్తన ప్యాకెట్లు: 72 లక్షలు

అందుబాటులో ఉన్నవి: 4,47,332

ఇప్పటికే విక్రయించిన ప్యాకెట్లు: 1,37,444

ఫిర్యాదు చేయండి.. చర్యలు తీసుకుంటాం

475 గ్రాముల పత్తి విత్తన ప్యాకెట్‌ను రూ.864కు మాత్రమే విక్రయించాలి. జిల్లాలో ఎక్కడైనా అంతకు మించి విక్రయాలు చేస్తే స్థానికంగా ఉన్న వ్యవసాయ కార్యాలయాల్లో రైతులు ఫిర్యాదు చేయాలి. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. సదాశివపేటలో ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి. అక్కడికి అదనపు కలెక్టర్ సైతం వెళ్లి తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. రైతులు ఒకే రకమైన విత్తన్నపై ఆధార పడకుండా విపణిలో లభిస్తున్న అధిక దిగుబడులిచ్చే అన్ని రకాల విత్తనాలు కొనుగోలు చేయవచ్చు.అంబికా సోనీ, జిల్లా ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారిణి.

# ఠాణాల ప్రక్షాళనకు వేళాయె



హైదరాబాద్ : ఆదాయానికి మించి ఆస్తులున్నట్టు నిర్ధారణ కావటంతో అరెస్టయిన నగర సీసీఎస్ ఏసీపీ.. భూవివాదం కేసు మాఫీకి రూ.3 లక్షలు తీసుకుంటూ బుక్కయిన కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్, ఎస్సై.. రూ.30 వేలు డిమాండ్ చేస్తూ పట్టుబడిన మాదాపూర్ ఎస్సై.. న్యాయస్థానం నుంచి వచ్చిన ఎన్‌బీడబ్ల్యూ జారీని బూచిగా చూపుతూ రూ.5 లక్షలు అడిగిన చైతన్యపురి కానిస్టేబుళ్లు.. వెరసి వీరంతా ఈ ఏడాది 5 నెలల వ్యవధిలో అనిశాకు చిక్కారు. సీపీలు మారినా సహచరులపై సస్పెన్షన్ వేటు పడుతున్నా కొందరిలో మార్పు రావట్లేదు. దీంతో ఠాణాల ప్రక్షాళనకు రంగం సిద్ధమవుతోంది. ఏళ్ల తరబడి ఒకే ఠాణాలో పాతుకుపోయిన అధికారులు, సిబ్బందిని గుర్తిస్తున్నారు.

దళారులదే హవా

కొందరు ఇన్‌స్పెక్టర్లు సివిల్ దుస్తుల్లోనే ఠాణాలకు వస్తున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. రాత్రి విధులకు రాకుండా పబ్‌లు, బార్‌ల్లో గడుపుతున్నారని నలుగురు సైబరాబాద్, హైదరాబాద్ ఎస్సైలకు మెమోలు ఇచ్చినట్టు సమాచారం.

ప్రజాభవన్ వద్ద మద్యం మత్తులో డివైడర్‌ను ఢీకొట్టిన కేసులో మాజీ ఎమ్మెల్యే కుమారుడుని తప్పించిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లపై వేటు పడింది. తూర్పుమండలంలో ఒక ఇన్‌స్పెక్టర్ రోడ్డు ప్రమాదం కేసు తారుమారు చేసి సస్పెన్షన్‌కు గురయ్యారు.

దక్షిణమండలంలోని రెండు ఠాణాలు వివాదాలకు; చిరునామాగా మారుతున్నాయి.

రౌడీషీటర్లు, మద్యం బెల్టుదుకాణాలు ఎక్కువగా ఉండే ఒక ఠాణాలో ఏ కేసు నమోదు చేయాలన్నా దళారిని ఆశ్రయించాల్సిందే. ఈ విషయంలో విచారణ చేపట్టిన డీసీపీ అడ్మిన్ ఎస్సైను బాధ్యతల నుంచి తప్పించారు. అర్ధరాత్రి 2 గంటల వరకూ ఆ మధ్యవర్తి ఠాణాలో ఉన్నట్లు నిర్ధారించారు.

మరో ఠాణాలో హోంగార్డు ఏజెంట్ అవతారమెత్తి ఇన్‌స్పెక్టర్‌కు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. రేషన్ పట్టుబడితే మధ్యవర్తిత్వం వహించి ఏకంగా రూ.లక్షతో తనపై అధికారికి సెటిల్ చేయించాడు. స్థానికంగా ఉన్న బెల్టు షాపుల వద్ద నెలనెలా మామూళ్లు వసూలు చేస్తున్నాడు. ఎలాంటి కేసైనా ముందు హోంగార్డు చెవిన పడ్డాకే ఇన్‌స్పెక్టర్ వద్దకు వెళ్లాలి. ః రాచకొండ పరిధిలోని ఒక ఠాణాకు అధికంగా భూవివాద ఫిర్యాదులు వస్తుంటాయి. వీటి పరిష్కారానికి దళారులు రంగంలోకి దిగుతారు. రాత్రుళ్లు స్టేషన్‌లోనే పంచాయితీలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బాబోయ్ వసూల్‌రాజాలు

గతంలో పోలీస్‌స్టేషన్ నిర్వహణకు దుకాణాలు, హోటళ్లు, మద్యం దుకాణాలు తదితర వాటి నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేసేవారు. ప్రభుత్వం ప్రతినెలా స్టేషనరీ ఖర్చులకు నిధులు కేటాయించటంతో అవన్నీ బంద్ అయ్యాయి. మళ్లీ కొన్ని ఠాణాల్లో పాత పద్ధతి అమలవుతోందనే ఆరోపణలున్నాయి. అందుకు ప్రయివేటు వ్యక్తులు/ హోంగార్డులు/ కానిస్టేబుళ్లను రంగంలోకి దింపినట్టు తెలుస్తోంది. ః 'లూప్‌లైన్ నుంచి చాలాకాలం తరువాత వచ్చాను. మీరేం చేస్తారో నాకు తెలియదు.. మీ ఠాణా నుంచి నెలకు రూ.50-60 వేలు రావాల్సిందే. ఇదీ దక్షిణ మండలం పరిధిలో ఇన్‌స్పెక్టర్లకు ఒక ఏసీపీ హుకుం.

మీరు ఇన్‌స్పెక్టర్‌కు ఎంతిచ్చినా మీ కేసు ముందుకు కదలాలంటే నన్నూ సంతృప్తిపరచాలని సౌత్‌ఈస్ట్ పరిధిలో ఓ ఎస్సై అల్టిమేటం.

సౌత్‌వెస్ట్ పరిధిలో ఒక మహిళా ఎస్సై మరో అడుగు ముందుకేసినట్టు ఆరోపణలున్నాయి. ఇద్దరు కానిస్టేబుళ్లను తన సెక్టార్‌లో కేవలం వసూళ్ల కోసమే నియమించినట్టు ఫిర్యాదులందాయి.

దక్షిణ మండల పరిధిలో ఒక ఎస్సై కేసు నమోదు చేయాలంటే ఎంతోకొంత ముట్టజెప్పాలనే నియమం పెట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఎస్‌హెచ్‌వో పిలిచి పద్ధతి మార్చుకోమని సూచించినట్టు తెలుస్తోంది.

# కంపుకొడుతున్నా పట్టదా?



వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి రోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. చాలామంది ఆలయవసతి గదుల్లో విడిది చేస్తుంటారు. అయితే వాటి పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించి దుర్వాసన రావడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తగినంత మంది సిబ్బంది ఉన్నప్పటికీ పారిశుద్ధ్యం లోపించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రాజన్న ఆలయ వసతి గదులు, వరండాల్లో శుభ్రం చేస్తున్న సిబ్బంది వాటి పరిసరాలను పట్టించుకోవడం లేదు. దీంతో చెత్తాచెదారం, వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో దుర్వాసన రావడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆలయానికి చెందిన భీమేశ్వరసదన్, పార్వతీపురం, లక్ష్మీగణపతి, అమ్మవారి కాంప్లెక్స్, నందీశ్వర కాంప్లెక్స్‌లలో భక్తులకు గదులను కేటాయిస్తుంటారు. ఇందులో భీమేశ్వర సదన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయి. మిగతా వాటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. గదుల్లో అద్దెకు దిగిన వారు వ్యర్థాలను కిటికీల్లో నుంచి బయటకు వేయడంతో అపరిశుభ్రంగా మారుతున్నాయి. కొన్నిసార్లు కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన రావడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా ఆలయ అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల భక్తుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.

పైపుల లీకేజీతో...

ఆలయ వసతి గదుల భవనాల్లోని బాత్‌రూంలు, మరుగుదొడ్ల నుంచి మురుగు పోయే పైపుల ఛాంబర్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వ్యర్థాలు అందులోనే ఉండిపోయి దుర్వాసన వస్తోంది. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ఛాంబర్లు తెరుచుకొని ఉండటంతో వాటిలో చెత్తాచెదారం నిండిపోయి మురుగు వెళ్లడానికి అంతరాయం ఏర్పడుతుంది. ఆలయ వసతి గదుల పరిసర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో సీసీ ఫ్లోరింగ్ లేకపోవడంతో మట్టి వ్యర్థాలు, చెట్ల ఆకులు వంటివి పేరుకుపోతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ వసతి గదుల నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా గదుల్లో పైపులైన్లు లీకేజీ అవుతున్నాయి. భవనాలపై నీటి ట్యాంకుల వద్ద పైపుల లీకేజీలతో నీరు మెట్ల వెంబడి కిందకు పారుతుండటంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. అద్దె పెంచిన అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాత సామగ్రితో...

చాలా వసతి గదులు శిథిలమైన సామగ్రితో నిండిపోయాయి. విరిగిపోయిన కుర్చీలు, బెంచీలు, ఎలక్ట్రికల్ సామగ్రి, మంచాలు, పరుపులు వంటి వాటిని తొలగించాల్సిన ఆలయ అధికారులు వాటిని గదుల్లోనే పెట్టడంతో భక్తులకు ఉపయోగపడకుండా పోతున్నాయి. దాదాపు అన్ని కాంప్లెక్స్‌ల్లో ఇలా పనికి రాని సామగ్రితో నిండిపోయిన గదులున్నాయి. వాటిని తొలగించి భక్తులకు గదులు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చర్యలు తీసుకొంటాంవసతి గదుల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బందితో ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. ఛాంబర్లు, పైపులైన్ వ్యవస్థను ఇంజినీరింగ్ విభాగం చూసుకుంటుంది. నర్సయ్య, శానిటరీ విభాగం పర్యవేక్షకుడు, రాజన్న ఆలయం

# చేప పిల్లలు ఏమాయె..!

నల్గొండ : ఉచిత చేప పిల్లల పంపిణీ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నేటికీ స్పష్టతనివ్వడం లేదు. గత భారాస ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి ఏటా ఉచితంగా చేపలు, రొయ్య పిల్లలు పంపిణీ చేసేది. వాటిని మత్స్యకారులు చెరువుల్లో వదిలి జీవనోపాధిగా మార్చుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పథకం అమలుపై ఎలాంటి ఆదేశాలు జారీ చేయకపోవడంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. నిబంధనల ప్రకారం ఇప్పటికే చేప పిల్లల విత్తనాల కోసం టెండర్లు పిలవాల్సి ఉన్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

జూన్ వచ్చినా టెండర్లేవీ..! నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో చేపల పిల్లల పంపిణీకి నిర్వహించే టెండర్ల విషయమై జూన్ మాసం వచ్చినా నేటికీ ఎలాంటి అతీగతి లేదు. గత ప్రభుత్వం ఏప్రిల్ చివరలో టెండర్లకు ప్రకటన విడుదల చేసి మే రెండో వారంలో టెండర్లు ఖరారు చేసి విత్తనాలు పెంచే జలాశయాలను మత్స్యశాఖ అధికారులు తనిఖీలు చేసి ధ్రువీకరించేవారు. ఈ సారి జూన్ వచ్చినా టెండర్ల ప్రక్రియ ఖరారు చేయలేదు.

ఆలస్యమైతే ఎదుగుదలపై ప్రభావం గతేడాది ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేప పిల్లలు పంపిణీ చేసిన గుత్తేదారులకు నేటికీ బిల్లులు చెల్లించలేదని తెలిసింది. దీంతో ఇప్పటికప్పుడు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకొచ్చే పరిస్థితులు కనిపించటం లేదని సమాచారం. చేప విత్తనాల పంపిణీని సెప్టెంబరు నెల చివరి వరకు పూర్తి చేస్తేనే పిల్లల ఎదుగుదల జరుగుతుంది. జాప్యమైతే అంతంత మాత్రంగానే జరిగి మత్స్యకారులకు ప్రయోజనం ఉండదని సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

ఆదేశాలు రాలేదు

చేపల పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు బాధ్యతలు అప్పగిస్తాం. వర్షాలు కురవగానే చేప పిల్లలను చెరువుల్లో వదలుతాం.ఎం.వెంకయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, నల్గొండ

# ఏ మాత్రం పట్టదా..

మంచిర్యాల : జీజీహెచ్‌లోని జనరల్ మెడిసిన్ ఓపీ గదిలో పలు రకాల మందులు అందుబాటులో లేవని ఏర్పాటు చేసిన సూచిక. ఇలా అన్ని విభాగాల్లో అక్కడి వైద్యులకు గుర్తుచేసేలా గోడలకు అంటించారు. దాదాపు 15 రకాల మాత్రల్లో తప్పనిసరి అవసరమైనవి 7-8 రకాల ఉన్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. రోజూ ముగ్గురు, నలుగురు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నవారు వస్తున్నారని, వారికి ఇవ్వాల్సిన మాత్రలు ప్రస్తుతం నిల్వ లేకపోవడం ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

జిల్లాకు మంజూరైన సీడీఎస్(సెంట్రల్ డ్రగ్ స్టోర్)భవన నిర్మాణ పనులు ఏడాదికి పైగా వాయిదాపడి ఎట్టకేలకు ఇటీవలే మొదలయ్యాయి. ఇది అందుబాటులోకి రావాలంటే కనీసం మరో సంవత్సరమైనా పడుతోంది. ఈ కేంద్రం వినియోగంలోకి వస్తే గానీ మందుల కొరత తీరేలా లేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కేంద్రంగానే మందుల సరఫరా కొనసాగుతుండగా హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్.. అక్కడి నుంచి మంచిర్యాలకు చేరే వరకు చాలా వరకు నిల్వలు, అనేక రకాల మాత్రలు లేకుండా పోతున్నాయని పర్యవేక్షకులు చెబుతున్నారు.

మంచిర్యాల జిల్లా జనరల్ ప్రభుత్వాసుపత్రి(జీజీహెచ్)ని మందుల కొరత వెంటాడుతూనే ఉంది. రోజు రోజుకి నిల్వలు తగ్గడంతోపాటు ముఖ్యమైన మాత్రలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. రెండు జిల్లాలకు పెద్దదిక్కుగా ఉన్న జీజీహెచ్‌లోనే ఈ పరిస్థితి నెలకొంటే ఇంకా ఎక్కడికి వెళ్లాలి అంటూ మారుమూల నుంచి వచ్చే బాధితులు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు నుంచి కొనుగోలు చేసేందుకు అవకాశమున్నా నగదు చెల్లింపులు సక్రమంగా చేయడం లేదు. దీంతో



కంపెనీలు కూడా నిలిపివేశాయని ఫార్మసిస్టులు చెబుతున్నారు. సీడీఎస్ జిల్లా కేంద్రంలో లేకపోవడంతోనే ఈ దుస్థితి వస్తుందంటూ తెలుపుతున్నారు.

ఇప్పటికి పూర్తి కావాలి.. కానీ ఇప్పుడే మొదలు

జిల్లా కేంద్రంలో సీడీఎస్ భవన నిర్మాణానికి గతేడాది మొదట్లోనే శంకుస్థాపన చేశారు. రూ.మూడున్నర కోట్లకు పైగా నిధుల మంజూరు కాగా తెలంగాణ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ నిర్మాణ బాధ్యతను చేపట్టింది. పాలనాధికారి కార్యాలయ సమీపంలో భూమిని కేటాయించగా ఈ సమయానికి నిర్మాణ పనులు పూర్తికావాలి. కానీ ఇప్పుడిప్పుడే ఈ పనులు మొదలుపెట్టారు. సీడీఎస్ మంజూరు మూడేళ్ల ముందే కాగా సూచికతో సరిపెట్టారు తప్పితే సరిపడా మందులు అందుబాటులో ఉంచలేదు. బాధితులు పలు రకాల మాత్రల కోసం ఇప్పటికీ ప్రైవేటు మందుల దుకాణాలబాట పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా కేంద్రం నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన చేపడితే గానీ ఈ కొరత తీరదు.

డీఎంఈ దృష్టికి తీసుకెళ్లా

డా.హరిశ్చంద్రారెడ్డి, పర్యవేక్షణాధికారి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ఆసుపత్రిలో అనేక రకాల మాత్రల కొరత వెంటాడుతోంది. సీడీఎస్‌ను సంప్రదిస్తే నిల్వలు లేవని సమాధానం ఇస్తున్నారు. దీంతో బాధితులు ఇబ్బంది పడుతున్నారు. ఆదిలాబాద్ కేంద్రంగా మందులు సరఫరా కావడంతోనే సమస్య ఏర్పడుతోంది. ఈ విషయంపై ఇటీవలే హైదరాబాద్‌కు వెళ్లి డీఎంఈని కలిసి మందుల పరిస్థితిని వివరించాను. జిల్లాలోనే కేంద్ర ఔషధ గిడ్డంగి ఉంటేనే సేవలు మెరుగుపడతాయి. మందుల కొరత తీరుతుంది.

# వలస జీవులకు రైతన్న అండ!

గంగాధర : ఒకప్పటి కరవు నేల సాగునీటి ప్రాజెక్టులతో కోనసీమగా మారింది. తెలంగాణకే ధాన్యాగారంగా మారిన జిల్లాలో వరిధాన్యం సిరులు కురిపిస్తోంది. గతంలో చిన్న కమతాల్లో మాత్రమే వరిపంట సాగు చేసే రైతులు ఇప్పుడు పెద్ద విస్తీర్ణంలో వేస్తున్నారు. నాడు కేవలం మార్కెట్ యార్డుల్లో మాత్రమే వ్యాపారులు వరి ధాన్యం కొనుగోలు చేపట్టగా.. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దాదాపు అన్ని గ్రామాల్లో ప్యాక్స్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వేలాది క్వింటాళ్ల ధాన్యం తూకం వేస్తున్నారు. విద్యుత్తు కాంటాలు వినియోగిస్తుండగా స్థానిక హమాలీల కొరతతో బిహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు ఇక్కడకు చేరుకొని రెండు పంట సీజన్లలో హమాలీ పనులు చేస్తున్నారు. వారికి ఉపాధి లభిస్తుండగా రైతులకు సకాలంలో ధాన్యం తూకం జరుగుతుంది.

ఒక్కో బ్యాచ్‌లో ఏడుగురు..

జిల్లాలోని దాదాపు అన్ని కేంద్రాల్లోనూ స్థానికేతరులే హమాలీ పనులు చేస్తున్నారు. జిల్లాలోని 321 కేంద్రాల్లో మే 18 వరకు 2.26 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. క్వింటా ధాన్యానికి రూ.35 నుంచి రూ.40 వరకు హమాలీలకు రైతులు చెల్లిస్తున్నారు. గంగాధర మార్కెట్‌తోపాటు హిమ్మత్‌నగర్, ఉప్పరమల్యాల గ్రామాల్లోని కేంద్రాల్లో మాత్రమే స్థానిక హమాలీలు ధాన్యం తూకం వేస్తుండగా మిగతా అన్ని కేంద్రాల్లో ఇతర రాష్ట్రాల హమాలీలే ధాన్యం తూకం చేస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో ఏడుగురు ఉంటుండగా ఒకేసారి ధాన్యం సంచుల్లో నింపి కాంటాపై బరువు తూచి మూతికుట్లు వేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లిలో ఇలా మూడు బ్యాచ్‌ల్లో 21 మంది చేరుకున్నారు. ఇలా అయిదేళ్లుగా రెండు పంట సీజన్లలో వారు ఇక్కడకు చేరుకుని హమాలీ పనులు చేస్తున్నారు.

అయిదేళ్లుగా వస్తున్నాం..

లక్ష్మీదేవిపల్లి గ్రామానికి అయిదేళ్లుగా రెండు పంట సీజన్లకు వచ్చి హమాలీ పనులు చేస్తున్నాం. ఈసారి మూడు బ్యాచుల్లో 21 మందితో వచ్చి ఇప్పటికే 50 లారీల ధాన్యం తూకం వేశాం. ప్రతి రైతుకు మేము తెలిసిపోయాం. రైతులు మమ్మల్ని ఆదరించి అదనంగా డబ్బులు ఇస్తూ అండగా ఉంటున్నారు. ధాన్యం తూకం అయిపోయాక, మా ప్రాంతానికి వెళ్లి మళ్లీ పంట సీజన్‌లో రైలులో వస్తాం.

పవన్‌మండెల్, బిహార్

కుటుంబాలను పోషించుకుంటున్నాం

మా దగ్గర పంటలు పండక ఉపాధి లభించడం లేదు. ఏటా రెండు, సీజన్లలో ఇక్కడకు వచ్చి రెండు, మూడు నెలలపాటు ధాన్యం తూకం వేస్తుంటాం. వచ్చిన డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా దగ్గరి నుంచి వందలాది మంది ఈ జిల్లాకు పనులు వెతుక్కుంటూ వచ్చారు. ఇక్కడి రైతుల ఆదరణ చూసి ప్రతిసారీ వస్తున్నాం.




## టీడీపీ కార్యకర్తలను చంపి ఢిల్లీ వెళ్లి అక్కడ దీక్షచేయడం ఏంటి: హోంమంత్రి అనిత

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు నాల్గవ రోజు గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. వైసీపీ సానుభూతి పరులపై దాడులు జరుగుతున్న విషయం వాస్తవమేనా అని వైసీపీ వాళ్లు ప్రశ్నవేసి.. సభకు రాలేదని ఎద్దేవా చేశారు. నిజానికి టీడీపీ వాళ్లను చంపి అదేదో తాము చేసినట్టు ఆరోపిస్తున్నారని, అధికారం కోల్పోయి.. 11 సీట్లు సాధించాక టీడీపీ కార్యకర్తలను చంపి ఢిల్లీ వెళ్లి అక్కడ దీక్షచేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నలుగురు చనిపోతే ముగ్గురు టీడీపీకి చెందిన వారు ఉన్నారని, దానికి సంభందించి కేసు నెంబర్లతో సహ వెల్లడించామని హోంమంత్రి తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరిగాయని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారని, వారి పేర్లు చెప్పమంటే మాట్లాడలేదని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. 36 మంది వివరాలు అసెంబ్లీకి వచ్చి ఇవ్వవచ్చుకదా.. అలా చేయకుండా ఢిల్లీ ఎందుకు వెళ్లారని ఆమె ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఆత్మకూరుకు ప్రతిపక్షనేత చంద్రబాబు వెళ్లాలనుకుంటే ఆయన ఇంటి గేటుకు తాళ్లు కట్టారని, పవన్ కళ్యాణ్ అమరావతి రైతుల వద్దకు వెళితే ముళ్లకంపలు వేశారని, యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు స్టూల్ ఎక్కి నిల్చోవడానికి కూడా అనుమతి ఇవ్వలేదని హోంమంత్రి మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం మీడియాతో పాటు ఎవ్వరినీ వదలలేదు అనే విషయం మర్చి పోకూడదని.. ఇలాంటి భయానక వాతావరణంను గత అయిదు సంవత్సరాలు రాష్ట్రంలో సృష్టించారని అన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్‌ను అడుగుతున్న.. 36 మంది చనిపోయారు అని అంటున్నారు. దానికి ఆయన సభకు వచ్చి ఆ వివరాలు ఇవ్వాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. తాము చర్యలు తీసుకుంటామని.. అయితే జగన్ ఇచ్చిన వివరాలు తప్పు అని తేలితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు భాద్యులవుతారని ఆమె హెచ్చరించారు. లోకేష్ రెడ్ బుక్ గురించి వైసీపీ కార్యకర్తలే పట్టించుకోవడం లేదని.. మరి జగన్‌కు ఎందుకు నిద్దర పట్టడం లేదో చెప్పాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.

# దేశంలోనే ఈవేస్ట్‌లో ఏపీ 12వ స్థానం



అమరావతి, జూలై 25: ఏపీ శాసనమండలి సమావేశాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శాసనమండలిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... దేశంలోనే ఈ వేస్ట్‌లో రాష్ట్రం పన్నెండో స్థానంలో ఉందన్నారు. ఈ వేస్ట్ రిసైక్లింగ్ కోసం రాష్ట్రంలో ఆరు కేంద్రాలున్నాయన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు రీసైక్లింగ్ చేస్తున్నామన్నారు.
పెరుగుతున్న ఈ వేస్ట్‌కు అనుగుణంగా ప్రతి జిల్లా కేంద్రంలోనూ రీ సైక్లింగ్ సెంటర్స్ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ తెలిపారు.
**నిత్యావసర వస్తువులపై మంత్రి నాదెండ్ల...** నిత్యావసర వస్తువులపై మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నామన్నారు. కేంద్రం కూడా యాప్ ద్వారా రాష్ట్రంలోని నాలుగు సెంటర్స్ నుంచి 22 వస్తువులు ధరలు సేకరిస్తుందన్నారు. 181 రూపాయలున్న కందిపప్పును ప్రత్యేక కౌంటర్ల ద్వారా 160 రూపాయలకే అందిస్తున్నామన్నారు. స్టీమ్ రైస్‌ను కేజీ 49 రూపాయలకు, రా రైస్‌ను 48 రూపాయలకు అందిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కందిపప్పు , బియ్యం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటున్నాంమని తెలిపారు. నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెట్‌పై కూడా దృష్టి సారించామన్నారు. నిత్యావసర వస్తువులు వ్యాపారుల చేతుల్లో కంటే వినియోగదారుల వద్ద ఉండేలా చర్యలు తీసుకుంటున్నాంమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మరోవైపు ఏపీ అసెంబ్లీ శాసనసభ సమావేశాలు కూడా ప్రశాంతంగా జరుగుతున్నాయి. సభ మొదలైన వెంటన స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానం ఇస్తున్నారు. రాష్ట్రంలో రౌడీయిజంపై మంత్రి హోంమంత్రి సమాధానం ఇచ్చారు. అలాగే విశాఖపట్నం పాలిటెక్నిక్ కాలేజ్‌లో టాయిలెట్ల షార్టేజ్‌పై ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రశ్నించగా... త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.
అనంతరం టీడీఆర్ బాండ్లపై తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నలకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి.

## అన్నమయ్య జిల్లాలో అమానుష ఘటన.. మహిళను చెట్టుకు కట్టేసి కోడిగుడ్లతో దాడి..



వీరబల్లి: అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం షికారిపాలెంలో అమానుష ఘటన జరిగింది. ఓ మహిళను గ్రామస్థులు చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెట్టారు. కొందరు మహిళలు కర్రలతో కొడుతూ కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. సదరు మహిళ ఇటీవల భర్త నుంచి విడిపోయి మరో పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె తప్పుచేసిందంటూ పలువురు మహిళలు చిత్రహింసలు పెట్టారు. స్థానికుల సమాచారంతో వీరబల్లి పోలీసులు బాధితురాలిని పీఎస్‌కు తీసుకెళ్లారు. ఆమె నుంచి ఎస్సై ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# ఒక్కొక్కటిగా పెద్దిరెడ్డి బాగోతాలు బయటకు..



## వందల సంఖ్యలో ఫిర్యాదులు

అన్నమయ్య జిల్లా: మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ అక్రమాలు, అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అండ చూసుకుని ఐదేళ్లు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు చెలరేగిపోయారు. తాజాగా పెద్దిరెడ్డి కుటుంబం చేతిలో మోసపోయిన బాధితులు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి భారీగా చేరుకుంటున్నారు. వందల సంఖ్యల్లో భూ బాధితులు కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. మరికాసేపట్లో భూ బాధితుల నుంచి వినతి పత్రాలను రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా స్వీకరించనున్నారు. మదనపల్లి, పుంగనూరు, తంబళ్లపల్లి, పీలేరు నాలుగు నియోజకవర్గాల నుంచి బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పెద్దిరెడ్డి కుటుంబం దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలకు భయపడి తమ బాధను ఇంతకాలం బయటకొచ్చి చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైళ్ల దహనం ఘటనపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. మదనపల్లి డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్లతో సిసోడియా సమావేశమయ్యారు. ఫైళ్ల దహనం ఘటనపై పోలీసుల దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది. మరోవైపు.. రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వివిధ కంపెనీలు కొలువుతీరాయి. ఆ భూమి మధ్యలో 20.5 ఎకరాల అసైన్డ్ పొలం ఉంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సతీమణి స్వర్ణలత పేరిట ఇప్పుడు ఆ భూమి ఉంది. దీని మార్కెట్ విలువ రూ. 100 కోట్ల పైమాటే. వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా సెటిల్ చేశారు. ఇప్పుడు దాని గురించి తమకు ఏమీ తెలియదంటున్నారు. 100 ఎకరాల ప్రభుత్వ భూమి మధ్యలో 20 ఎకరాల అసైన్డ్ భూమి ఎలా వచ్చి చేరింది? అది పెద్దిరెడ్డి ఇంటి పేరిట ఎలా మారింది? అంతా పరమ రహస్యం. నాటి తిరుపతి జిల్లా కలెక్టర్‌కు, జిల్లా రెవెన్యూ అధికారులకే తెలిసిన రహస్యం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏర్పేడు మండలంలో వికృతమాల గ్రామం ఉంది. ఇది రేణిగుంట ఎయిర్‌పోర్టు పక్కనే ఉంది. ఎయిర్‌పోర్టు భూములు, వికృతమాల భూములు పక్కపక్కనే ఉన్నాయి. వికృతమాల గ్రామ పరిధిలో 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో వివిధ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలకు భూములు కేటాయించారు. అక్కడ కంపెనీల ఆఫీసులు ఏర్పాటయ్యాయి. దానిపక్కనే 524-1 సర్వే నంబరులో 2.5 ఎకరాల భూమిని 2022లో పెద్దిరెడ్డి స్వర్ణలత కొన్నారు. కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాక 2022 సెప్టెంబరులో ఆ భూమి మ్యుటేషన్ చేశారు. 533, 534, 535, 536, 537 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో అనూహ్యంగా అసైన్డ్ భూమి పుట్టుకొచ్చింది. 533 సర్వే నంబర్‌లో 5 ఎకరాలు (2007)లో, 534లో 5 ఎకరాలు 2005లో అసైన్ చేసినట్లుగా రికార్డులు తెరమీదకు తీసుకొచ్చారు. ఈ రెండు సర్వే నంబర్లలోని 10 ఎకరాల భూమి 2022 సెప్టెంబరులోనే స్వర్ణలత పేరిట మ్యుటేషన్ చేశారు. ఆ సర్వే నంబర్ల పక్కనే ఉన్న 535 నంబర్‌లో 5.1 ఎకరాల ప్రైవేటు భూమి ఉన్నట్లుగా, దాన్ని కూడా పెద్దిరెడ్డి కొనుగోలు చేసినట్లుగా రికార్డులు చూపిస్తున్నాయి. చుట్టూ ప్రభుత్వ భూమి, దాని మధ్యలో ప్రైవేటు భూమి ఉంది. ఇది ఎలా వచ్చిందో ఇక్కడ మిస్ అయిన లాజిక్. అయినా సరే పెద్దిరెడ్డి ఎలా కొన్నారు. ఆ భూమిని పెద్దిరెడ్డి కోరుకున్నారని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో అసైన్డ్ భూమిని పుట్టించారా? లేక అధికార బలంతో ఆ భూములను దక్కించుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది.




ఉత్తర్ ప్రదేశ్‌లో కావడి యాత్ర సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల విషయంలో నెలకొన్న వివాదంపై అమెరికా స్పందించింది. పాకిస్థాన్‌కు చెందిన ఓ విలేకరి నేడు 'కావడి యాత్ర' సందర్భంగా చెలరేగిన వివాదాన్ని అగ్రరాజ్య విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వద్ద లేవనెత్తాడు. దీనిపై మిల్లర్ స్పందిస్తూ.. "ఆ పరిణామాలు అమెరికాకు తెలుసు. అదే సమయంలో భారత సుప్రీంకోర్టు జులై 22వ తేదీన యూపీ ప్రభుత్వ ఆదేశాలను నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఇచ్చిన విషయమూ మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం ఆ ఆదేశాలు నిలిచిపోయాయి. సాధారణంగా అమెరికా మత స్వేచ్ఛ హక్కును గౌరవించడాన్ని ప్రోత్సహిస్తుంది.
అన్ని మతాలను గౌరవించే విషయంలో భారత్‌తో కలిసి పనిచేస్తుంది" అని మిల్లర్ పేర్కొన్నారు. భారత అంతర్గత విషయాలను పాకిస్థాన్‌కు చెందిన జర్నలిస్టులు తరచూ అమెరికా విదేశాంగ శాఖ వద్ద ప్రస్తావించి స్పందన కోరడం పరిపాటిగా మారింది. కావడి యాత్ర మార్గంలో తినుబండారాలు విక్రయించేవారు తమ యజమానుల పేర్లను తప్పనిసరిగా ఆహారశాలలపై ప్రదర్శించాలన్న ఉత్తర్వులపై జులై 22న సుప్రీంకోర్టు స్టే విధించింది. విక్రయించేది శాకాహారమా, మాంసాహారమా అనేది ప్రదర్శిస్తే సరిపోతుందని, హోటల్ యజమానులు ఎవరు.. అందులో పనిచేసే వారెవరు అనే వివరాల కోసం బలవంతం చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. గంగానది జలాలను కావడిపై తీసుకువచ్చి శివలింగాలకు అభిషేకం చేసేందుకు భక్తులు వెళ్లే మార్గాల్లో ఉన్న హోటళ్లపై వాటి యజమానుల పేర్లు ప్రదర్శించాలని ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో స్థానిక అధికారులు ఆదేశాలివ్వడాన్ని సవాల్ చేస్తూ తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, పౌరహక్కుల పరిరక్షణ సంఘం నేతలు తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్‌ల ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. దీనికి ఆ రాష్ట్రాల తరఫున న్యాయవాదులెవరూ హాజరుకాలేదు.




## జగన్.. అసెంబ్లీకి వచ్చి ఆ పేర్లు చెప్పే దమ్ము లేదా?: ఏపీ హోంమంత్రి అనిత

అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికీ తెదేపా కార్యకర్తలపై దాడులు కొనసాగుతున్నాయని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. తమ పార్టీ కార్యకర్తలపై దాడులు చేస్తూ దిల్లీ వీధుల్లో సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేశ్ రెడ్‌బుక్ గుర్తొస్తే ఆయనకు నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో అనిత మాట్లాడారు. "రాష్ట్రంలో 36 హత్యలు జరిగాయని దిల్లీలో జగన్ అబద్ధాలు చెప్పారు. హత్యకు గురైనవారి పేర్లు అడిగితే ఆయన చెప్పలేకపోయారు. అసెంబ్లీకి వచ్చి ఆ పేర్లు చెప్పే దమ్ము జగన్‌కు లేదా? అసెంబ్లీలో అడగకుండా దిల్లీలో మాట్లాడితే ఏం లాభం? రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆయన కుట్ర చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎలా ప్రవర్తించారో మర్చిపోయారా? శాంతిభద్రతల గురించి మాట్లాడే హక్కు ఆయనకు ఉందా?. హోంమంత్రిగా జగన్‌ను అసెంబ్లీకి ఆహ్వానిస్తున్నా. హత్యల వివరాలు అందిస్తే తగిన విచారణ చేయిస్తాం. తప్పుడు వివరాలు ఇచ్చినట్టు తేలినా చర్యలు తీసుకుంటాం." అని అనిత నిలదీశారు.




న్యూఢిల్లీ: విజయవాడ విమానాశ్రయం విస్తరణ పనులపై పార్లమెంట్‌లో మచిలీపట్నం జనసేన ఎంపీ వల్లభనేని బాలసౌరి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం ఇచ్చారు... విజయవాడ విమానాశ్రయం విస్తరణ పనులు 2020 జూన్‌లో ప్రారంభమయ్యాయని, మొత్తం రూ. 611 కోట్ల అంచనాలతో పనులు మొదలు పెట్టారన్నారు. కరోనా సహా... రాష్ట్రంలో నెల కొన్న ఇతర కారణాల రీత్యా కూడా... పనులు ఆలస్యం అయ్యాయని పేర్కొన్నారు. నిర్మాణాలకు అవసరమైన ఇసుక లభించకపోవడం కూడా ఆలస్యానికి కారణమని చెప్పారు. విజయవాడ విమానాశ్రయం పనులు ప్రాధాన్యత కింద చేపడుతున్నామని, 2025 జూన్ నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. గత పదేళ్ళలో పౌర విమానయాన రంగ మౌలిక వసతులు గణనీయంగా అభివృద్ధి చెందాయని, పదేళ్ల క్రితం రైల్వే శాఖకు ఉన్న డిమాండ్ ఇప్పుడు విమానయాన రంగం వైపు మళ్లిందని అన్నారాయన. దాదాపు ప్రతి సభ్యుడు తమకు విమానాశ్రయం, విమానయాన అనుసంధానం అడిగే పరిస్థితి వచ్చిందని బాలసౌరి ప్రశ్నకు సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. గతంలో విజయవాడ నుంచి ముంబైకి రెండు సర్వీసులు ఉండేవని.. వాటిని పునరుద్ధరించాలని సభ్యుడు బాలసౌరి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. విజయవాడ నుంచి ఢిల్లీ, కోల్‌కతా, ముంబైకి విమానాలు నడపాలని... ఢిల్లీ నుంచి విశాఖపట్నం, తిరుపతికి విమాన సర్వీసులు పెంచాలని బాలసౌరి కోరారు.. అలాగే విజయవాడ నుంచి కొలంబో, థాయిలాండ్, సింగపూర్‌కు ప్రయాణీకుల నుంచి డిమాండ్ పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఎంపీ బాలసౌరి విజ్ఞప్తి చేశారు. విమాన సర్వీసులు పెంచే విషయంలో మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకునే అధికారం లేదని రామ్మోహన్ నాయుడు అన్నారు. డిమాండ్, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విమానయాన సంస్థలు నిర్ణయం తీసుకుంటాయని, మంత్రిత్వ శాఖ కేవలం మౌలిక సదుపాయాలు మాత్రమే కల్పించగలుగుతుందని వెల్లడించారు. సభ్యుల నుంచి వస్తున్న విజ్ఞాపనలను సానుకూలంగా స్వీకరించి.... వాటిని సంబంధిత సంస్థలకు పరిశీలించాలని పంపుతున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

# పల్నాడులో పరిస్థితి మరింత దారుణం..



ఢిల్లీ: ఏపీలో నెలకొన్న నీటి సమస్యలపై ఎంపీలావు శ్రీకృష్ణ దేవరాయలు లోక్‌సభలో మాట్లాడారు. ముఖ్యంగా ఏపీలోని పల్నాడులో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. భూగర్భ జలాలలన్నీ అడుగంటి పోయాయని.. 200 వరకు తవ్వితేనే... నీళ్లు వస్తాయని వివరించారు. కేంద్రం నిధులు కేటాయిస్తున్నా కూడా గత ప్రభుత్వం వాటిని ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. కనీసం నీళ్లు లభించే ప్రాంతాల నుంచి అయినా సరఫరా చేసే ఆలోచన ఏమీ చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మారుమూల జిల్లాల్లో కూడా జలజీవన్ మిషన్ కింద కుళాయి నీటి సదుపాయం కల్పించినట్లు మంత్రి చెప్పారు. పల్నాడు జిల్లాలో పరిస్థితి మరో విధంగా ఉందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు వెల్లడించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఉందని ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. బోర్ వెల్ కనీసం 1200 వరకు తవ్వితేనే... నీళ్లు వస్తాయని వివరించారు. గత ఐదేళ్లలో రూ. 350 కోట్లు కేటాయించినా... నిధులు ఖర్చు చేయలేదని నరసరావుపేట ఎంపీ తెలిపారు. నీళ్లు లభించే ప్రాంతం నుంచి సరఫరా చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి... తగిన విధంగా సహాయ పడాలని కేంద్రాన్ని శ్రీకృష్ణ దేవరాయలు కోరారు. శ్రీకృష్ణదేవరాయలు లేవనెత్తిన ప్రశ్న చాలా సీరియస్ అంశం అని, దీనిపై అనేక ఫిర్యాదులు కూడా వచ్చాయన్న కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. నీటి లభ్యత, సరఫరా వ్యవహారాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి చర్యలు తీసుకుంటుం దన్నారు. లావు శ్రీకృష్ణదేవరాయలు లేవనెత్తిన అంశాన్ని ప్రత్యేకంగా చూడాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో నీటి లభ్యత ఎంత ఉంది, ఎక్కడి నుంచి తీసుకోవాలో నిర్ణయం చేయొచ్చని మంత్రి పేర్కొన్నారు.
గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ లో జలజీవన్ మిషన్ కింద 40 శాతం వరకూ గృహాలకు కుళాయి నీటి వసతి లభించిందని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. ప్రస్తుతం మొత్తంగా... 72, 73 శాతం వరకూ కుళాయి సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కేంద్రం నుంచి ఇచ్చే నిధులు, సాంకేతిక సహకారంతో 100 శాతం పూర్తి అవుతుందని తెలుగుదేశం పార్టీ లోక్‌సభ సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాదరావు అడిగిన ప్రశ్నకు సభలో జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సమాధానం చెప్పారు

# వావ్.. రకుల్ సో గ్లోరియస్.. అవార్డు కూడా!

కెరటం మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన పంజాబీ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్.. ఆ తర్వాత వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ తో సూపర్ హిట్ అందుకుంది. నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధృవ సినిమాలతో మంచి క్రేజ్ సంపాదించుకుంది. కమర్షియల్ హిట్స్ సాధించి స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తున్న సమయంలో బాలీవుడ్ ఆఫర్స్ రావడంతో అక్కడికి చెక్కేసింది అమ్మడు. కొండపొలం చిత్రం తర్వాత ఒక్క తెలుగు మూవీలో కూడా నటించని రకుల్.. మంచి స్టోరీ దొరికితే మళ్లీ రీ ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇండియన్-2 మూవీలో నటించి ఫ్లాప్ మూటగట్టుకుంది. అంతే కాదు సీక్వెల్ లో ఆమె నటిస్తే.. సినిమా ఫ్లాప్ అయిపోతుందన్న అపవాదు అందుకుంది! అయితే బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తున్నా.. కమర్షియల్ హిట్స్ అందుకోవడంలో మాత్రం ఫెయిల్ అవుతోంది రకుల్ ప్రీత్ సింగ్. రీసెంట్ గా నెక్సా అవార్డు అందుకుంది అమ్మడు.



గత ఏడాది ఆమె నటించిన ఛత్రీవాలి సినిమాకు గాను అవార్డు గెలుచుకుంది. ఆ అవార్డు పట్టుకుని పిక్స్ దిగి షేర్ చేసింది రకుల్. ఇక స్టైల్ విషయంలో ఏ మాత్రం తగ్గిన అమ్మడు.. నెక్సా అవార్డు ఫంక్షన్ కు ఆరెంజ్ కలర్ స్లీవ్ లెస్ బాడీ కాన్ డ్రెస్ లో వెళ్లింది. థై స్లిట్ గౌనులో ఈవెంట్ కు వెళ్లిన అమ్మడు.. అక్కడ ఉన్న వారందరినీ ఫిదా చేసింది. అదే సమయంలో ఫోటో షూట్ దిగి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. స్టైలిష్ డ్రెస్ లో అదిరిపోయే పోజులిచ్చింది రకుల్. ఔట్ ఫిట్ కు తగ్గట్టు ఇయర్ రింగ్స్ పెట్టుకుంది. సింపుల్ గా ఒక్క బ్రాస్లెట్ మాత్రమే ధరించి అందంగా కనిపించింది. గ్లోయింగ్ స్కిన్, థై షోతో ఫిదా చేస్తోంది. ఓ రేంజ్ లో ఎక్స్ప్రెషన్స్ ఇస్తూ కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేస్తోంది. కొంటెగా చూస్తూ మాయ చేస్తోంది. క్యూట్ గా నవ్వుతూనే సెగలు రేపుతోంది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ కొత్త పిక్స్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. డ్రెస్ కన్న రకుల్ స్టిల్స్ కేక అని నెటిజన్లు చెబుతున్నారు. ఏ డ్రెస్ లో అయినా అమ్మడు అందమేనని అంటున్నారు. చూపులతో మైండ్ బ్లాక్ చేస్తుందని కామెంట్స్ పెడుతున్నారు. సింపుల్ అండ్ షైనీ బ్యూటీ అంటూ పొగిడేస్తున్నారు. అమ్మడిని పొగడ్తలతో ఆకాశానికెత్తేస్తున్నారు. అవార్డు వచ్చినందుకు కంగ్రాట్స్ చెప్తూ లైకులు కొడుతున్నారు. మరి రకుల్ కు అవార్డు వచ్చేలా చేసిన ఛత్రీవాలి సినిమా జీ ఫైవ్ ఓటీటీ లో స్ట్రీమింగ్ అవుతోంది. మీరు ఆ మూవీని చూశారా?

# ఎన్టీఆర్ తో డాన్స్ అంటే.. జాన్వీ క్రేజీ కామెంట్

ప్రస్తుతం ఇండియాలో బెస్ట్ డాన్సర్స్ అయిన స్టార్ హీరోలు ఎవరంటే వెంటనే తెలుగు హీరోల వైపు అందరూ చూపిస్తారు. టాలీవుడ్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్, ఎన్టీఆర్ టాప్ డాన్సర్స్ గా ఉన్నారు. హిందీలో డాన్స్ అంటే హృతిక్ రోషన్ పేరు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. ఈ నలుగురుని బీట్ చేసే డాన్సర్స్ ప్రస్తుతం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై లేరని చెప్పొచ్చు. మెగాస్టార్ తర్వాత ఆ స్థాయిలో ఛరిష్మాటిక్ డాన్స్ తో అదరగొట్టే స్టార్స్ అంటే వీళ్ళే కనిపిస్తారు. అయితే వీరందరిలో బెస్ట్ డాన్సర్ అంటే ఎక్కువ మంది జూనియర్ ఎన్టీఆర్ పేరు చెబుతారు. తారక్ ఎలాంటి రిహార్శల్స్ లేకుండానే క్లిష్టతరమైన స్టెప్పులు అయిన కూడా ఈజీగా చేస్తాడని చాలా మంది ప్రశంసిస్తూ ఉంటారు. అల్లు అర్జున్, రామ్ చరణ్ అయితే డాన్స్ ప్రాక్టీస్ ముందుగానే చేస్తారు. తారక్ మాత్రం ఆన్ సెట్ లోనే అప్పటికప్పుడు స్టెప్పులు వేసి మెప్పిస్తాడు. అందుకే తారక్ తో డాన్స్ చేయడం చాలా కష్టం అని హీరోయిన్స్ సైతం అంటూ ఉంటారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ తో డాన్స్ చేయడాన్ని ఆస్వాదిస్తామని



చెబుతారు. కొరియోగ్రాఫర్స్ కూడా జూనియర్ ఎన్టీఆర్ కోసం అదిరిపోయే స్టెప్పులు డిజైన్ చేస్తారు. ఇదిలా ఉంటే తారక్ ప్రస్తుతం దేవర సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ సాంగ్ షూట్ చేసారంట. ఈ సాంగ్ కి బాలీవుడ్ కొరియోగ్రాఫర్ బాస్కో డాన్స్ కంపోజ్ చేశాడు. ఇది వరకు తెలుగులో శ్రీమంతుడు, ధృవ సినిమాలకి అతను వర్క్ చేశాడు. ఓ ఇంటర్వ్యూలో బాస్కో ఎన్టీఆర్ డాన్స్ పై ప్రశంసలు కురిపించారు. దేవర మూవీ కోసం ఎన్టీఆర్ తో వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఓ సాంగ్ కోసం క్లిష్టతరమైన స్టెప్పులని కూడా చాలా ఈజీగా కంపోజ్ చేసాను. ఇదంతా ఎన్టీఆర్ వలనే సాధ్యం అయ్యింది. సినిమాలో ఎన్టీఆర్ డాన్స్ అదిరిపోతుంది. కచ్చితంగా అందరూ ఎంజాయ్ చేస్తారని బాస్కో చెప్పుకొచ్చారు. అలాగే దేవర సినిమాలో హీరోయిన్ గా నటిస్తోన్న జాన్వీ కపూర్ కూడా ఎన్టీఆర్ డాన్స్ పై ప్రశంసలు కురిపించింది. విక్కీ కౌశల్, హృతిక్ రోషన్ లో ఎవరితో మీరు డాన్స్ చేయడానికి ఇష్ట పడతారు అని యాంకర్ ఓ ఇంటర్వ్యూలో అడిగారు. తాను జూనియర్ ఎన్టీఆర్ తో డాన్స్ చేయడానికి ఇష్టపడతానని జాన్వీ కపూర్ చెప్పింది. ఇప్పటికే దేవర మూవీలో ఒక సాంగ్ లో ఎన్టీఆర్ తో కలిసి డాన్స్ చేశాను. మరో సాంగ్ కూడా ఉంది. అందులో అతనితో కలిసి డాన్స్ చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




# కన్నప్ప.. నాధనందుడు ఎవరంటే..




మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప సినిమా పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోంది. ముఖేష్ కుమార్ సింగ్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఇతను హిందీలో మహాభారతం సీరియల్ ని తెరకెక్కించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే కన్నప్ప సినిమా నుంచి టీజర్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. ఈ టీజర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే కొంతమంది ట్రోలింగ్స్ కూడా చేశారు. సుమారు 100 కోట్ల బడ్జెట్‌తో మంచు మోహన్ బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతీయ పురాణాల కథ ఆధారంగా కన్నప్ప మూవీ తెరకెక్కుతోంది. శ్రీకాళహస్తిలో నిజంగా జరిగిన భక్త కన్నప్ప వృత్తాంతానికి కన్నప్ప సినిమా ద్వారా దృశ్యరూపం ఇస్తున్నారు. ఇందులో టైటిల్ రోల్ ని మంచు విష్ణు పోషిస్తున్నారు. అయితే ఈ సినిమాలో ఎంత ఒరిజినల్ కథని తీసుకున్నారు. ఏ మేరకు ఫిక్షనల్ జోడించారు అనేది పూర్తిగా తెలియదు. కానీ కన్నప్ప ప్యూర్ హిస్టరీ బేస్డ్ గా తెరకెక్కిన చిత్రం అని మంచు విష్ణు ఇప్పటికే మీడియాకి తెలియజేశారు. ఈ సినిమాలో డార్లింగ్ ప్రభాస్, బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, మలయాళీ సూపర్ స్టార్ మోహన్ లాల్ కీలక పాత్రలలో నటించారు. అలాగే శరత్ కుమార్, మంచు మోహన్ బాబు కూడా కథలో కీలకమైన క్యారెక్టర్స్ ని చేశారు. తాజాగా శరత్ కుమార్ చేసిన క్యారెక్టర్ పోస్టర్ ని చిత్ర యూనిట్ రిలీజ్ చేసింది. మూవీలో నాధనందుడు అనే పాత్రలో శరత్ కుమార్ నటించారని చెప్పారు. తాజాగా ఈ క్యారెక్టర్ బ్యాక్ డ్రాప్ ని కూడా 24 ఫ్రేమ్ ఫ్యాక్టరీ ద్వారా తెలియజేశారు. నాధనందుడు పాండవులలో ఒకడైన భీమసేనుడు, హిడింబి వంశ వారసుడు అని తెలియజేశారు. అలాగే కోయలకి నాయకుడిగా అతని పాత్ర ఉంటుందని పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఈ పాత్ర మూవీలో చాలా పవర్ ఫుల్ గా ఉండబోతోందనే విషయాన్ని కూడా రివీల్ చేశారు. కన్నప్ప క్యారెక్టర్ కూడా కోయ కమ్యూనిటీకి చెందినదిగానే ఉంటుంది. ట్రైబల్ వారియర్ గా ఉన్న మహావీరుడైన కన్నప్ప పరమశివభక్తుడుగా ఎలా మారాడు అనేది ఈ కన్నప్ప మూవీలో చూపించబోతున్నారంట. మోహన్ బాబు క్యారెక్టర్ కూడా సినిమాలో చాలా స్ట్రాంగ్ గా ఉండబోతోందని తెలుస్తోంది. స్టార్ క్యాస్టింగ్ మూవీలో ఉండటంతో పాన్ ఇండియా లెవల్ గట్టిగా సౌండ్ క్రియేట్ చేసే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

# ఇండియాలోనే నెం.1.. 'పుష్ప 2' తగ్గేదేలే!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ "పుష్ప 2: ది రూల్". ఇది 'పుష్ప: ది రైజ్' చిత్రానికి సీక్వెల్. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనికి తగ్గట్టుగానే ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ పార్ట్ ఊహించని విధంగా బాక్సాఫీస్ దగ్గర భారీ బ్లాక్ బస్టర్ గా నిలవడంతో, ఇప్పుడు అందరూ సెకండ్ పార్ట్ కోసం ఆతృతగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే 2024లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా 'పుష్ప 2' నిలిచింది. ప్రముఖ మూవీ రేటింగ్ సంస్థ ఐఎండీబీ తాజాగా 2024లో సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న టాప్-10 ఇండియన్ సినిమాల జాబితాను ప్రకటించింది. ఇందులో 'పుష్ప 2: ది రూల్' చిత్రం అగ్ర స్థానంలో నిలిచింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో రూపొందుతున్న 'దేవర 1' మూవీ రెండో స్థానాన్ని ఆక్రమించింది. అక్షయ్ కుమార్ నటిస్తున్న హిందీ చిత్రం 'వెల్ కమ్ టూ ది జంగిల్' థర్డ్ ప్లేస్ లో ఉంది. కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ హీరోగా వెంకట్ ప్రభు తెరకెక్కిస్తున్న 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' మూవీ నాలుగో స్థానాన్ని సంపాదించింది. తమిళ హీరో సూర్య, సిరుతై శివ కాంబోలో రాబోతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'కంగువ' ఈ ఏడాది మోస్ట్ యాంటిసిపేటెడ్ అప్ కమింగ్ ఇండియన్ మూవీస్ లిస్టులో ఐదో ప్లేస్ లో నిలిచింది. రోహిత్ శెట్టి దర్శకత్వంలో బాలీవుడ్ స్టార్స్ అజయ్ దేవగణ్, రణవీర్ సింగ్, దీపికా పదుకునే, కరీనా కపూర్ ఖాన్ కలిసి నటిస్తున్న హిందీ సినిమా 'సింగం అగైన్' ఆ తర్వాతి స్థానంలో ఉంది. కార్తీక్ ఆర్యన్ చేస్తున్న హారర్ కామెడీ మూవీ 'భూల్ భూలయ్యా 3' ఏడో స్థానాన్ని సాధించింది. చియాన్ విక్రమ్, డైరెక్టర్ పా. రంజిత్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'తంగలాన్' ఐఎండీబీ జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. అజయ్ దేవగన్, టబు కలిసి నటించిన 'ఔరోన్ మే కహన్ దమ్ థా' సినిమా 9వ ప్లేస్ లో ఉండగా.. శ్రద్ధా కపూర్, రాజ్ కుమార్ రావ్ ప్రధాన పాత్రల్లో రూపొందిన 'స్త్రీ 2' చిత్రం ఈ లిస్టులో చివరి ప్లేస్ లో ఉంది. 2024 జనవరి 1 నుంచి 2024 జూలై 10 మధ్య కాలంలో ప్రపంచవ్యాప్తంగా వందల మిలియన్ల మంది విజిటర్స్ వాస్తవ పేజీ వ్యూస్ ఆధారంగా ఈ జాబితా రూపొందించినట్లుగా %×వీణదీ% పేర్కొంది. అయితే ఈ లిస్టులో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబోలో రూపొందుతున్న 'గేమ్ చేంజర్' సినిమాకి ఈ జాబితాలో చోటుదక్కకపోవడం గమనార్హం. ఇకపోతే 2021 డిసెంబర్ లో వచ్చిన 'పుష్ప: ది రైజ్' సినిమా బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించింది. ముఖ్యంగా నార్త్ బెల్ట్ లో ఎలాంటి అంచనాలు లేకుండా రిలీజై, సంచలనం సృష్టించింది. పుష్పరాజ్ గా అల్లు అర్జున్ అద్భుతమైన నటనకు పాన్ ఇండియా ఆడియన్స్ ఫిదా అయ్యారు. ఇదే 69 ఏళ్లుగా టాలీవుడ్ కు అందని ద్రాక్షగా ఉన్న జాతీయ ఉత్తమ నటుడి అవార్డు తెచ్చిపెట్టింది. ఇక ఈ సినిమాలో 'తగ్గేదే లే' అనే బన్నీ మేనరిజం.. ఆయన పలికిన 'పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా.. ఫైర్' వంటి డైలాగ్స్ ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లల దగ్గర నుంచి సినీ క్రీడా సెలబ్రిటీల వరకూ అందరి దృష్టిని ఆకర్షించారు. అందుకే ఇప్పుడు "పుష్ప 2: ది రూల్" కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇదే ఐఎండీబీ ద్వారా మరోసారి స్పష్టమైంది. 2024లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా 'పుష్ప 2' నిలిచిన నేపథ్యంలో చిత్ర బృందం ఎక్స్ లో పోస్ట్ పెట్టింది. 'తగ్గేదే లే' అంటూ పుష్పరాజ్ టైటిల్ సాంగ్ క్లిప్పింగ్ ని షేర్ చేసింది. ఈ సందర్భంగా డిసెంబర్ 6న తేదీన వరల్డ్ వైడ్ గా అల్లు అర్జున్ సినిమా రిలీజ్ అవుతుందని మరోసారి క్లారిటీ ఇచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుండగా.. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. 'పుష్ప 2: ది రూల్' మూవీ కచ్చితంగా 1000 కోట్ల క్లబ్ లో చేరుతుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# సమంత రహస్య ప్రపంచం ఎవరికైనా తెలుసా?

సమంత రూత్ ప్రభు ఎవరికీ తెలియని ఓ రహస్య ప్రపంచంలోకి వెళ్లిపోతోందా? అంటే అవుననే అంటున్నారు. అయితే ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా? అనే సందేహాలు ఎవరికైనా కలగడం సహజం. వివరాల్లోకి వెళితే.. సమంత రూత్ ప్రభు ఇటీవల కొన్ని వ్యక్తిగత ఎపిసోడ్ల తర్వాత 'ఖుషి' అనే రెగ్యులర్ కమర్షియల్ సినిమాలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్ కి వెళ్లిపోతోంది అంటూ ప్రచారం సాగినా అవన్నీ పుకార్లుగానే మిగిలాయి. అక్కడ సల్మాన్, షారూఖ్ వంటి పెద్ద స్టార్ల సరసన నటించే అవకాశం ఉందని కూడా ప్రచారం సాగింది. కానీ ఏదీ వర్కవుట్ కాలేదు. కానీ ఇప్పుడు తన స్నేహితులు రాజ్ అండ్ డీకేతో కలిసి ముచ్చటగా మూడోసారి పాన్ ఇండియన్ ప్రాజెక్ట్ కోసం పని చేయనుంది. అది కూడా ఓ వెబ్ సిరీస్ కోసం. ఈ సిరీస్ నిజంగా ఉత్కంఠ రేకెత్తించే ఎలిమెంట్స్ తో తెరకెక్కనుంది. ఇంకా చెప్పాలంటే అనేక అవార్డులు రివార్డులతో సంచలనం సృష్టించిన 'తుంబాద్' తరహాలో ఒక రహస్య ప్రపంచంలో సాగే కథలోకి సమంత వెళ్లిపోనుందట. ఇందులో సామ్ పాత్ర కూడా అంతే ప్రత్యేకంగా ఉంటుందని చెబుతున్నారు. ఈసారి తుంబాద్ దర్శకుడు రాహి అనీల్



బార్వే రూపొందించనున్న తాజా వెబ్ సిరీస్ టైటిలే ఉత్కంఠను పెంచింది. రక్త్ బ్రహ్మాండ్-అనేది టైటిల్. టైటిల్ కి తగ్గట్టే కథాంశం ఉత్కంఠ కలిగిస్తుందని చెబుతున్నారు. అభిమానం, కుట్రలు, ప్రేమ, త్యాగం, విధితో కూడిన ఉత్కంఠభరితమైన కథను తెరపై చూపించనున్నారట. ఒక ప్రత్యేకమైన రహస్య ప్రపంచంలోకి ఆడియెన్ ని తీసుకెళ్లేందుకు క్షణక్షణం టెన్షన్ ను అనుభవించేందుకు అవసరమైన సరంజామాను దర్శకుడు సిద్ధం చేసారట. దీనిని తొలుత సినిమాగా తీయాలనుకున్నా కథ స్పాన్ పరంగా పునరాలోచించి ఒక వెబ్ సిరీస్ అయితే న్యాయం చేయగలమని దర్శకనిర్మాతలు ఇలా ప్లాన్ చేసారని తెలిసింది. అయితే ఈ సిరీస్ లో సమంత పాత్ర ఎలా ఉంటుందో మాత్రం దర్శకుడు ఇంకా రివీల్ చేయలేదు. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్, వామికా గబ్బి ఇతర పాత్రధారులు. రాజ్ అండ్ %ణఖ% క్రియేటివ్ పార్ట్ లో ఉన్నారు. నిర్మాతలుగా కొనసాగుతారు. ఫ్యామిలీమ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ తర్వాత రాజ్ అండ్ డీకేతో సమంతకు మూడో అవకాశం ఇది. మరోసారి తన బ్రాండ్ ని పెంచే సిరీస్ ని వారు అందిస్తారని సమంత నమ్మకంగా ఉంది. ముఖ్యంగా తుంబాద్ దర్శకుడి క్రియేటివ్ ప్రపంచం తనకు మంచి పేరు తెస్తుందని కూడా సమంత భావిస్తోందట. సమంత ఈ సిరీస్ తో పాటు ఒకే ఒక్క సినిమాలో నటిస్తోంది. అది కూడా తన సొంత బ్యానర్ సినిమా. బంగారం అనే టైటిల్ ని ప్రకటించిన సంగతి తెలిసిందే.

# నయన్ డిమాండ్ మాత్రం తగ్గదంతే..?

లేడీ సూపర్ స్టార్ నయనతార సౌత్ లో ఏ హీరోయిన్ సంపాదించలేని క్రేజ్ తెచ్చుకుంది. సోలో సినిమాలతో స్టార్ హీరోలకు కూడా గట్టి పోటీ ఇచ్చిన అమ్మడు అప్పటికీ ఇప్పటికీ అదే రేంజ్ లో అదరగొట్టేస్తుంది. పెళ్లి తర్వాత కాస్త దూకుడు తగ్గినట్టు అనిపించిన నయన్ మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చేలా సినిమాలు చేస్తుంది. బాలీవుడ్ లో ఆమె చేసిన జవాన్ సినిమా సక్సెస్ అవ్వడంతో అక్కడ నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయి. ఐతే బాలీవుడ్ కన్నా సౌత్ సినిమాలే ముఖ్యంగా తమిళ సినిమాలే బెటర్ అని భావిస్తుంది నయనతార. ఈమధ్య ఒక బాలీవుడ్ ప్రొడక్షన్ నుంచి భారీ ఆఫర్ రాగా ఆ ఛాన్స్ వదులుకుందట నయనతార. కారణాలు ఏంటన్నది తెలియదు కానీ ఆ హిందీ సినిమాలో తనకు నటించే ఆసక్తి లేదని చెప్పేసిందట. ఐతే నయన్ కోసం వారు భారీ రెమ్యునరేషన్ ఆఫర్ ఇచ్చారని టాక్. ఐతే నయనతార సినిమాలు చేస్తూ రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తుంది కానీ కేవలం రెమ్యునరేషన్ కోసం ఏ సినిమా చేయదు. అందుకే ఆ ఆఫర్ ని సున్నితంగానే తిరస్కరించిందట అమ్మడు. ఇక కోలీవుడ్ విషయానికి



వస్తే ప్రస్తుతం అక్కడ రెండు సినిమాలు చేస్తున్న నయనతార మరో రెండు కథలను చర్చల్లో ఉంచింది. ఈమధ్య తమిళ్ లో కూడా తన దూకుడు తగ్గిందని వార్తలు వచ్చినా ఇలాంటి టైం లోనే అమ్మడు మరింత పనిచేయాలని అనుకుంటుంది. టాలీవుడ్ నుంచి అవకాశాలు వచ్చినా వాటిని సరిగా పట్టించుకోని నయనతార ఇప్పుడు తెలుగు ఆఫర్ వచ్చినా చేసేందుకు రెడీ అని అంటుంది. భర్త విఘ్నేష్.. ఇద్దరు పిల్లలతో ఓ పక్క ఫ్యామిలీ లైఫ్ ని కూడా ఎంజాయ్ చేస్తున్న నయనతార కెరీర్ లో కాస్త స్పీడ్ పెంచాల్సినే అని అంటున్నారు ఆమె ఫ్యాన్స్. నయన్ చేస్తున్న సినిమాలు అవి తెస్తున్న ఫలితాలు ఆమె ఫ్యాన్స్ కి సంతృప్తికరంగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు ప్రయోగాలు చేసేందుకు ఇంట్రెస్ట్ చూపించే నయనతార అటు కమర్షియల్ సినిమాల్లోనూ ఛాన్స్ వస్తే చేస్తానని చెబుతుంది. పాన్ ఇండియా సినిమాల హంగామా నడుస్తున్న ఈ టైం లో ఇటు తెలుగులో కానీ అటు తమిళ్ లో కానీ ఎలాంటి సినిమా వచ్చినా నేషనల్ లెవెల్ క్రేజ్ ఉన్న నయనతార బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. అయితే కథల విషయంలో ఆమె చాలా శ్రద్ధగా ఉంటుంది కాబట్టి తన దగ్గరకు వచ్చిన ప్రతి సినిమా ఓకే చెప్పే ఛాన్స్ లేదని తెలుస్తుంది.

